## విద్యార్థుల సమస్యల పరిష్కారానికి బిఆర్ఎస్వి పోరుబాట




PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

## స్కేటింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా బొచ్చు రాకేష్ ఏకగ్రీవ ఎన్నిక




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 120 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 27 ఏప్రిల్ 2026

# మండలస్థాయికి 'ప్రజావాణి'

● న్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి ● రెండో దశలో మండలాలకు విస్తరించండి ● సమస్యలను పరిష్కరించేందుకు అధికారులకు పూర్తి అధికారాలు ● ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫామ్ ● అన్ని స్థాయిల్లో నిత్యం పర్యవేక్షించాలి : 'సీఎం ప్రజావాణి' సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం






**హైదరాబాద్,ఏప్రిల్26(పీసీడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మరుసటి రోజు (08.12.2023) మహాత్మ జ్యోతిభాపూలే ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన ప్రతి మంగళవారం 'సీఎం ప్రజావాణి' కార్యక్రమం అద్భుతంగా కొనసాగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అన్ని విభాగాలకు చెందిన అధికారులు అక్కడికక్కడే ప్రజలు ఇచ్చే అర్జీలను, దరఖాస్తులను స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే చర్యలు చేపడుతున్నారని అన్నారు. ప్రస్తుతం కలెక్టర్ల అధ్వర్యంలో జిల్లాల్లో ప్రతివారం ప్రజావాణి నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్‌డీలో నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంపై సీఎం సమీక్షించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి కార్యక్రమాన్ని వెంటనే రెవెన్యూ డివిజన్‌స్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు. ఆ తర్వాత మండల స్థాయిలో నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలన్నారు. ప్రజావాణిలో మిగతా2లో...

# 'నో స్టాక్' బోర్డులు కనిపించొద్దు!

● నేటిలోగా పెట్రోల్, డీజిల్ సరఫరా పెంచాలి
● ఎక్కడా బ్లాక్‌లో అమ్మకాలు జరగకూడదు
● ముఖ్యంగా రైతులకు ఇబ్బందులు రానీయొద్దు: సీఎం
● సమస్య పరిష్కారానికి టాస్క్‌ఫోర్స్, కంట్రోల్ రూమ్
● ఉన్నట్టుండి 'క్రెడిట్' విధానం మార్చేస్తే ఎలా?
● ఆయిల్ కంపెనీల తీరుపై ముఖ్యమంత్రి అసహనం
● రాష్ట్రంలో 421 బంకులే మూతపడ్డాయి: అధికారులు




**అమరావతి,ఏప్రిల్26(పీసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ కష్టాలపై సీఎం చంద్రబాబు నేరుగా రంగంలోకి దిగారు. ఆదివారం ఉదయం ముంబై నుంచి ఒకసారి, రాష్ట్రానికి చేరుకున్న తర్వాత తన క్యాంపు కార్యాలయం నుంచి మరోసారి సీఎస్ సాయి ప్రసాద్, ఉన్నతాధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్‌లో వరుస సమీక్షలు నిర్వహించారు. డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా ఉండేలా చూడాలని.. ఇంధన సంక్షోభం తొలగిపోయి సాధారణ పరిస్థితులు నెలకొనేలా తక్షణ చర్యలు తీసుకోవాలని, సోమవారం నాటికి ఎక్కడా పెట్రోల్ బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు కనిపించకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా వరి కోత యంత్రాలకు డీజిల్ కొరత రానివ్వొద్దన్నారు. ఎక్కడా బ్లాక్‌లో పెట్రోలు, డీజిల్ అమ్మకాలు జరగడానికి వీల్లేదని చెప్పారు. రిటైలర్లకు క్రెడిట్ విషయంలో ఉన్నట్టుండి పాలసీ మార్చడం ఏంటని ఆయిల్ కంపెనీల ప్రతినిధులను నిలదీశారు. ప్రజలను, ప్రభుత్వాన్ని ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టాలని చూస్తే అనుమతులపై మిగతా2లో...

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం.. ఉత్తర్వులు జారీ



**హైదరాబాద్,ఏప్రిల్26(పీసీడబ్ల్యూ న్యూస్):** గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, కోదండరామ్ రెడ్డిని నియమిస్తూ ఆదివారం అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. తెలంగాణ లెజిస్లేచర్ కౌన్సిల్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్‌రెడ్డి ఈ నియామకాలను ఆమోదించినట్టు ఉత్తర్వులలో పేర్కొన్నారు. మే 27, 2023 వ తేదిన గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు డి రాజేశ్వర్‌రావు, ఫారుఖ్ హుస్సెన్ ల పదవీకాలం ముగియడంతో వారి స్థానంలో వీరిద్దరి నియమించినట్టు ఉత్తర్వులలో పేర్కొన్నారు.

# పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ అరాచకం : రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ,ఏప్రిల్26(పీసీడబ్ల్యూ న్యూస్):** పశ్చిమ బెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ గూండాలు ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యకర్త దేబ్దీప్ ఛటర్జీని దారుణంగా హతమర్చారు. ఈ హత్యా ఘటనను కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా భారతదేశ అహింసా సంప్రదాయాన్ని మలినం చేసే ఈ రాజకీయాలకు తమ పార్టీ తలొగ్గదని ఆయన అన్నారు. దేబ్దీప్ మరణంతో తీవ్ర దు:ఖంలో ఉన్న ఆయన కుటుంబ సభ్యులకు రాహుల్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ లో పోస్టు చేశారు. ఈ సందర్భంగా రాహుల్ 'నేడు పశ్చిమ బెంగాల్ లో ఉన్నది ప్రజాస్వామ్యం కాదు. ఇప్పటికీ టిఎంసి భయోత్పాత పాలన కొనసాగుతోంది. ఓట్లు వేసిన తర్వాత బెదిరించడం, దాడి చేయడం, ప్రతిపక్షాల గొంతును నొక్కేయడం ఇదే టిఎంసికి ప్రధాన లక్షణంగా మారింది అని రాహుల్ ఎక్స్ పోస్టులో తీవ్రంగా ఆరోపించారు.'మేము కూడా మా కార్మికులను కోల్పోయాము, అయినప్పటికీ మేము ఎల్లప్పుడూ అహింసా మార్గాన్ని, రాజ్యాంగాన్నే ఎంచుకున్నాము. ఇదే మా వారసత్వం, ఇదే మా సంకల్పం. దోషులందరినీ తక్షణమే అరెస్టు చేయాలి- అని రాహుల్ ఎక్స్ పోస్టులో టిఎంసి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే దేబ్దీప్ కుటుంబానికి పూర్తి భద్రత, నష్టపరిమారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. భారతదేశ అహింసా సంప్రదాయాన్ని మలినం చేసే ఇలాంటి రాజకీయాలకు మేము తలవంచబోము. న్యాయం జరుగుతుంది అని రాహుల్ అన్నారు.



## కవిత పార్టీ ఏర్పాటుతో బీఆర్ఎస్ నేతల్లో వణుకు

టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఎక్స్‌లో ఆసక్తికరపోస్టు

**హైదరాబాద్,ఏప్రిల్26(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పార్టీ ఏర్పాటు పేరిట కవిత ఇచ్చిన మాస్టర్ స్ట్రోక్‌తో బీఆర్ఎస్ నాయకుల వెన్నులో వణుకు పుట్టించిందని ఆ పార్టీ నాయకులు విమర్శించారు. మిగతా2లో...

# స్వీయ గుర్తింపు కోసమే కేసీఆర్‌పై విమర్శలు

రాష్ట్ర ప్రజలు సీఎం పేరెత్తడానికే ఇష్టపడట్లేదు

తెలంగాణపై కుట్రలు ప్రారంభమయ్యాయి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**హైదరాబాద్,ఏప్రిల్26(పీసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో ముఖ్యమంత్రితో సహా కొంత మంది వ్యక్తులు తమకు సరైన గుర్తింపు రావడం లేదని కేసీఆర్‌పై విమర్శలు చేస్తూ కాలం వెల్లబుచ్చుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సీఎం అయిన తర్వాత కూడా యాక్టర్లు, యాంకర్ల నుంచి తెలంగాణ ప్రజల వరకు తన పేరెత్తడానికి ఇష్టపడటం లేదన్న ఆక్రోషంతోనే ప్రతిరోజు మాజీ సీఎంపై అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నేత

మిగతా2లో...



## ఎస్ఐఆర్ వల్ల నకిలీ ఓట్లను తొలగించవచ్చు: కిషన్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్26(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రజాస్వామ్య దేశంలో జనాభా లెక్కల సేకరణ గొప్ప కార్యక్రమం అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. జనగణనలో భాగంగా ఆయన ఆదివారం స్వీయ ధృవీకరణ చేసుకున్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. జనగణనలో తొలిసారి కులగణన జరుగుతోందని పేర్కొన్నారు. వివరాలు చెప్తే సంక్షేమ పథకాలు తొలగిస్తారనే భయం మిగతా2లో...

## త్వరలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు: మంత్రి పొన్నం

- పల్లె పల్లెకు ఆర్టీసీ బస్సులు..
- ప్రతి నియోజకవర్గానికి 1000 ఉచిత కుట్టు మిషన్లు
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



# మండలస్థాయికి 'ప్రజావాణి'

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలను ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని సూచించారు. సంబంధిత విభాగాలకు పంపించి, వాటి పురోగతిని అర్జీదారునికి తెలియజేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. **ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువు** ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువులు ఉండాలన్నారు. ఆలస్యం జరగకూడదని సూచించారు. ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని ఆదేశించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలని ఆయన సూచించారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రానికి వచ్చే బదులు ప్రజావాణి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సీఎం అన్నారు. ప్రతి స్థాయిలో ప్రజావాణి కోసం ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. **అవసరమైతే అప్పీల్ వ్యవస్థ** ఒకస్థాయిలో సమస్య పరిష్కారం కాకపోతే, పై స్థాయి అధికారికి అర్జీ అందేలా, ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను అమలు చేయాలని సీఎం సూచించారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతిని తెలుసుకునేలా వీలుండాలన్నారు. ఎక్కడైనా ఆలస్యం జరిగితే, సంబంధిత అధికారులను బాధ్యులను చేయాలని చెప్పారు. ప్రజావాణి సేవలను వికేంద్రీకరించటంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతోందన్నారు. కింది స్థాయిలోనే కొన్ని పరిష్కరించే వీలుంటుందని అభిప్రాయపడ్డారు. ప్రజలకు నమ్మకంగా ఉండేలా ప్రజావాణి సేవలు అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# 'నో స్టాక్' బోర్డులు కనిపించొద్దు!

(మొదటి పేజీ తరువాయి)

పునరాలోచన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో మళ్లీ సాధారణ పరిస్థితి నెలకొనే వరకు రెవెన్యూ, పోలీసు, లీగల్ మెట్రాలజీ విభాగాలతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయా లని కలెక్టర్లను ఆదేశించారు. **పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోండి** ముందుగా 'బెస్ట్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు అందుకొనేందుకు శనివారం ముంబై వెళ్లిన ఆయన.. తిరిగి ఏపీకి బయల్దేరే ముందు ఆదివారం ఉదయం అక్కడి నుంచే సీఎస్, ఇతర ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంధన సమస్యపై సాయంత్రంలోగా తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4,510 పెట్రోలు బంకులు (అవుట్ లెట్లు) ఉండగా... వాటిల్లో పెట్రోల్, డీజిల్ కొరత కారణంగా 421 బంకులు మూతపడ్డాయని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. ఇంధన సరఫరా గతంలో కంటే పెరిగినా.. వాహనదారుల ప్యానిక్ కొనుగోళ్ల కారణంగా అకస్మాత్తుగా డిమాండ్ పెరిగిందన్నారు. ఆయిల్ సంస్థలు శనివారం 10,345 కిలో లీటర్ల పెట్రోల్, 14,156 కిలో లీటర్ల డీజిల్‌ను సరఫరా చేసినట్లు చెప్పారు. ఇంధన కొరత ఉందన్న భయాందోళనలతో వాహనదారులు పెట్రోలు బంకుల దగ్గర బారులు తీరుతూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆక్వా రైతులు డ్రమ్ముల్లో కొనుగోళ్లు జరుపుతారని, వారికి పెట్రోలు, డీజిలు విక్రయించే విషయంలో సమస్య తలెత్తుతోందని వివరించారు. **వాణిజ్య వినియోగదారుల కొనుగోళ్ల వల్లే..** తర్వాత రాష్ట్రానికి చేరుకున్న వెంటనే సీఎం తన క్యాంపు కార్యాలయం నుంచి మరోసారి ఉన్నతాధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రిటైల్ ఔట్‌లెట్ల దగ్గర వాణిజ్య వినియోగదారులు కొనుగోళ్లు జరపడం వల్లే సమస్య తలెత్తిందని అధికారులు వివరించారు. సాధారణ రోజులతో పోలిస్తే శనివారం ఒక్కసారిగా 34 శాతం డిమాండ్ పెరిగిందని చెప్పారు. ఆదివారం కూడా 22 శాతం అధికంగా డిమాండ్ ఉందని తెలిపారు. డీజిల్ అమ్మకాలు సాధారణ పరిస్థితులతో (రోజుకు 9,048 కిలోలీటర్ల అమ్మకాలు) పోలిస్తే.. శనివారం 16 శాతం డిమాండ్ (10,556 కిలో లీటర్లు) పెరిగిందని, ఆదివారం కూడా 3 శాతం అధికంగా ఉందని చెప్పారు. నయారా, రిలయెన్స్, జియో తదితర ప్రైవేట్ కంపెనీలు తమ బంకులకు ఇంధన సరఫరాను పూర్తిగా నిలిపివేయడం వల్ల సమస్య మరింత తీవ్రమైందని కలెక్టర్లు సీఎంకు చెప్పారు. గురువారమే సమస్యను గుర్తించామని అధికారులు చెప్పగా.. సీఎం మరింత సీరియస్ అయ్యారు. 3 రోజుల క్రితమే గుర్తించినప్పుడు పరిస్థితిని చక్కదిద్దేందుకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నివేదికలివ్వడం కాదని, ఫలితాలు చూపించాలని చురకలంటించారు. **రైతులకు కూపన్ విధానాన్ని పరిశీలించండి** వ్యవసాయం, ఆక్వా రంగాలకు డీజిల్ అవసరాలు పెరిగాయని, ప్రస్తుత రబీ సీజన్‌లో వరికోత యంత్రాలకు డీజిల్ కొరత రానివ్వొద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. రైతులకు కూపన్ విధానాన్ని ప్రవేశపెట్టి, డీజిల్ సరఫరా చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. రాష్ట్రంలో ఒక్కసారిగా ఇంధన సమస్య తలెత్తడంపై విచారణ జరపాలని ఆదేశించారు. ప్రతి పెట్రోలు బంక్ దగ్గర రెవెన్యూ, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడమే కాకుండా సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. **బ్లాక్ మార్కెటింగ్‌ను ఉపేక్షించొద్దు: మంత్రి నాదెండ్ల** మరోవైపు రాష్ట్రంలో ఇంధన కొరత లేదని, ఒక్కసారిగా పెరిగిన ప్యానిక్ కొనుగోళ్ల వల్లే ఇబ్బందులు వచ్చాయని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆదివారం ఆయన హైదరాబాద్ నుంచి సివిల్ సప్లయిస్ కమిషనర్ కన్నబాబు, అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వాహనదారులు, ప్రజల్లో నెలకొన్న భయాందోళనలు, అపోహలను తొలగించేలా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. జిల్లాల్లో రోజువారీగా అందుబాటులో ఉన్న డీజిల్, పెట్రోలు నిల్వల పరిస్థితిని జేసీలు, డీఎ?సవోలు మీడియా ద్వారా వెల్లడించాలని ఆదేశించారు. కొన్ని చోట్ల పెట్రోలు బంకుల నిర్వాహకులు కృత్రిమ కొరత సృష్టించి.. డీజిల్, పెట్రోలును బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిని ఉపేక్షించవద్దని, కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. ప్రస్తుతం రబీ పంటల కోతలు, ఆక్వా పట్టుబడులు కొనసాగుతు న్నందున రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కాగా.. డీజిల్, పెట్రోల్ సమస్యకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆరోపించారు. సీఎం చంద్రబాబు సమీక్షలకే పరిమితం కావడం సరికాదని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# స్వీయ గుర్తింపు కోసమే కేసీఆర్‌పై విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

పిల్లుట్ల రఘు, హుజూర్ నగర్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులతో కలిసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబి కండువా కప్పి కేటీఆర్ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి రెండున్నర సంవత్సరాలు దాటినా కనీసం ప్రస్తావించడం లేదన్నారు. జేమ్స్ బాండ్ల మాదిరి బాండ్ పేపర్లు రాసి అడ్డగోలుగా అబద్ధాలు చెప్పారన్నారు. నల్లగొండ జిల్లాలో ఉన్న ఫ్లోరోసిస్ సమస్యను 60 ఏండ్లల్లో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పట్టించుకోకుండా తరాలకు తరాలనే అంగవైకల్యానికి గురిచేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత కేసీఆర్ ప్రారంభించి మిషన్ భగీరథతో ఫ్లోరోసిస్‌ను నల్లగొండనుంచి తరిమి కొట్టామన్నారు. జిల్లా రైతాంగం నీళ్ల కోసం వందల బోర్లు వేసి అష్టకష్టాలు పడే పరిస్థితి నుంచి పంట పొలాలకు సాగునీరు అందించేలా చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. దేశానికే తలమానికంగా నిలబడే యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానాన్ని చరిత్రలో నిలిచిపోయేలా రూ.1,800 కోట్లతో అత్యద్భుతమైన పుణ్యక్షేత్రంగా తయారు చేశామని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కరువు కాటకాలతో ఇబ్బంది పడ్డ నల్లగొండ లాంటి జిల్లా అత్యధిక వరి ధాన్యం పండించే స్థాయికి వెళ్లిందంటే బీఆర్‌ఎస్ పరిపాలన ఫలితమేనన్నారు. అప్పు చేసిండు అని చెప్పే కాంగ్రెస్ నేతలు రెండేండ్లలో రేవంత్ రెడ్డి రూ.3.7 లక్షల కోట్ల అప్పు తీసుకువచ్చి ఇప్పటిదాకా ఒక్క ఇటుక కూడా పేర్చలేదని ఎద్దేవా చేశారు. కాంట్రాక్టులకు, కమిషన్లకే ఖర్చు పెట్టారని మండిపడ్డారు. 2023 సాధారణ ఎన్నికలతో పోల్చితే పంచాయతీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలం పెరిగిందని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో వచ్చిన స్కైరూట్ కంపెనీకి రిబ్బన్ కట్ చేసి గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో ఒక్కొక్కరు కమల్ హాసన్ ను మించిన నటులున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ పైన మళ్ళీ కుట్రలు ప్రారంభమయ్యాయనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

# డబుల్ గేమ్

### శాంతి చర్చలంటూ అరేబియా సముద్రంలో అమెరికా యుద్ధ నౌకలు

### లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రకటించినా.. ఆగని ఇజ్రాయిల్ దాడులు

### దిగ్బంధనాలు, బెదిరింపులతో చర్చలు అసాధ్యం : అమెరికాతో ఒప్పందంపై ఇరాన్ ప్రధాని కీలక వ్యాఖ్యలు



**టెహ్రాన్ ఏప్రిల్26(పీసీడబ్ల్యూ న్యూస్):** అమెరికా, ఇజ్రాయిల్ డబుల్‌గేమ్ ఆడుతున్నా యనే చర్చ నడుస్తోంది. ఓ వైపు శాంతి చర్చలంటూ దౌత్యం నడుపుతూ.. మరోవైపు అరేబియా సముద్రంలో అమెరికా యుద్ధ నౌకల్ని మోహరింపజేస్తోంది. లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రకటించినా...ఇజ్రాయిల్ వైమానిక దాడులతో జనావాసాలపై విరుచుకుపడుతూనే ఉన్నది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాతో శాంతిచర్చలపై అనిశ్చితి నెలకొన్నదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక కామెంట్స్ చేశారు. అమెరికా విధిస్తున్న ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనం, బెదిరింపుల నడుమ ఆ దేశంతో చర్చలు అసాధ్యమని తేల్చి చెప్పారు. శనివారం పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన శాంతిచర్చలపై ఇరాన్ వైఖరిని స్పష్టం చేశారు. ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని వదులుకోదని, అలాగే ఒత్తిళ్లకు తలొగ్గి ఒప్పందాలు చేసుకోబోదని పెజెష్కియాన్ స్పష్టం చేశారు. ప్రస్తుత ఉద్రిక్తతలకు అమెరికానే కారణమని పెజెష్కియాన్ పేర్కొన్నారు. అమెరికా అనుసరిస్తున్న చర్యలే చర్చలకు ప్రధాన అడ్డంకి ఆయన పాక్ ప్రధానితో చెప్పినట్లు 'ప్రెస్ టీవీ' నివేదం చింది. ఏప్రిల్ 13 నుంచి ఇరాన్ ఓడరేవులను అమెరికా నౌకా దళం దిగ్బంధించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం వల్ల ఇరాన్ ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఇలాంటి దిగ్బంధనాల నడుమ పరస్పర నమ్మకాన్ని పునరుద్ధరిం చడం అసాధ్యమని పేజెష్కియాన్ వెల్లడించారు. అందుకే ఇరు దేశాల మధ్య చర్చలు జరగాలంటే ముందుగా అమెరికా ఆంక్షల ను తొలగించి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## కవిత పార్టీ ఏర్పాటుతో బీఆర్ఎస్ నేతల్లో వణుకు

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎల్.రరీ?పసింగ్, నవీన్ ఆచారి, మంచాల వరలక్ష్మి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ వదిలేసిన తెలంగాణ వాదాన్ని కవిత భుజానికి ఎత్తుకున్నారని, టీఆర్ఎసకు ఆమెనే నిజమైన హక్కుదారని అన్నారు. 2009లో మహబూబ్‌నగర్ ఎంపీగా కేసీఆర్ గెలిచేందుకు కవితనే కారణమన్న విషయాన్ని గులాబీ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. బీఆర్ఎస్ ముమ్మాటికీ సోషల్ మీడియా పార్టీనే అని, ఇప్పుడే ఇంత ఆగమైతే ఆ పార్టీ నాయకుల పరిస్థితి ఇకపై ఎలా ఉంటుందో ముందు ముందు తెలుస్తుందని హెచ్చరించారు. రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ తల్లి విగ్రహాలు, ట్యాంక్ బండ్‌పై జాతిపిత జయశంకర్ సార్ విగ్రహం పెట్టేందుకు ఏం ఇబ్బంది వచ్చిందని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు.

## ఎస్ఐఆర్ వల్ల నకిలీ ఓట్లను తొలగించవచ్చు: కిషన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

వద్దన్నారు. అందరూ ధైర్యంతో వివరాలు ఇవ్వాలి అని కోరారు. "ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్ఐ ఆర్‌ను అభినందించాలి. దీని వల్ల నకిలీ ఓట్లు తగ్గించొచ్చు. నకిలీ ఓట్ల తొలగింపుతో పోలింగ్ పర్సంటేజ్ పెరిగింది. హైదరాబాద్‌లో పోలింగ్ పర్సంటేజ్ 50 శాతం కూడా దాటడం లేదు. ఎస్ఐ ఆర్ పూర్తయితే ఇక్కడ కూడా పోలింగ్ పర్సంటేజ్ పెరుగుతుంది. తెలంగాణ పర్యటనకు రానున్న ప్రధాని మోడీ రైల్వే, జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రారంభిస్తారు" అని కిషన్ రెడ్డి తెలిపారు.

## త్వరలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు: మంత్రి పొన్నం

**ఉప్పునుంతల,ఏప్రిల్26(పీసీడబ్ల్యూ న్యూస్):** డిండి కట్ట మైసమ్మ ఆలయం అభివృద్ధికి రూ. 10 కోట్ల నిధులతో సమగ్ర ప్రణాళిక అమలు చేస్తామని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. ఉప్పునుంతల మండలంలోని ఆలయంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమిటీ చైర్మన్ ఎడ్ల నరేష్ యాదవ్ ఆధ్వర్యంలో సభ్యులు ప్రమాణం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ ప్రాంగణాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తూ బోటింగ్, రిసార్ట్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల సేవలను విస్తరించనున్నట్లు, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రతి నియోజకవర్గానికి వెయ్యి ఉచిత కుట్టు మిషన్లు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు భారీగా పాల్గొన్నారు.


# యుద్ధం పేరిట గ్యాస్ దందా...

**• ఏజెన్సీలే బ్లాక్ మార్కెట్ చేస్తున్న వైనం బుకింగ్ ఆలస్యం పేరిట అధిక ధరకు అమ్మకం • డొమెస్టిక్ సిలిండర్ల నుంచి కమర్షియల్ సిలిండర్లకు రీఫిల్లింగ్..నామ్‌కే వాస్తేగా విజిలెన్స్**




**హైదరాబాద్, ఏప్రిల్26(పీసీడబ్ల్యూ న్యూస్):** అమెరికా ప్రోద్బలంతో ఎక్కడోనున్న ఇజ్రాయిల్... ఇరాన్‌పై యుద్ధం చేస్తే మనకేం టి అనుకునే వారి జేబులకు ఇప్పుడు చిల్లులు పడుతున్నాయి. ఆ ప్రభావం ఢిల్లీని దాటి హైదరాబాద్ గల్లీలపై పడుతోంది. ముఖ్యంగా ఇది 'వంటిట్లో కుంపట్లు' పెడుతోంది. కప్పు ఛారు తాగుదామన్నా.. ప్లేటు ఇడ్లీ తిందామ న్నా.. ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. యుద్ధం పేరు చెప్పి గృహ (డొమెస్టిక్), వాణిజ్య (కమర్షియల్) సిలిండర్ల కృత్రిమ కొరత సృష్టించటం, వినియోగదారుల అవసరాలను ఆసరా చేసుకుని వాటి ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచి దందా నడుపుతున్నా రు. తెలంగాణ వ్యాప్తంగా ఈ దందా నడుస్తున్నా...పౌర సరఫరాలశాల విజిలెన్స్ విభాగం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తుండటం గమనార్హం. విభాగపు అధికారులు... ఐదారు వేల అక్రమ సిలిండర్లను సీజ్ చేశాం, దందా రాయుళ్లపై కేసులు నమోదు చేశామంటూ చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రాష్ట్రంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్ల యాజమానులు మాత్రం ఇప్పటికీ సిలిండర్లను బ్లాక్‌లోనే కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇంతకు ముందు డెలీవరి బారులు తమ దగ్గరికి వచ్చి సిలిండర్లను దించిపోయేవారని, కానీ ఇప్పుడు బ్లాక్‌లో అధిక మొత్తంలో 'సమర్పిస్తేనే' డెలివరీ చేయిస్తామంటూ ఏజెన్సీలే బెదిరిస్తున్నాయని పలు టిఫిన్ సెంటర్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమర్షియల్ సిలిండర్ ధర ఇప్పుడు అసలు ధర కంటే రెండింతలు పెరిగి పోయిందని, ఇది తమకు భరించలేని భారంగా మారిందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **కమర్షియల్ రూ.5 వేలు.. డొమెస్టిక్ రూ.3,500** ఈ దందా వల్ల రూ.2,105 ఉన్న కమర్షియల్ సిలిండర్‌ను బ్లాక్‌లో ఏకంగా రూ.5 వేలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. రూ.950గా ఉన్న డొమిస్టిక్ సిలిండర్ ధరను దళారులు రూ.2 వేల నుంచి రూ.3,500 పెంచి అమ్ముకుంటున్నారు. దీంతో వినియోగదారులపై తీవ్ర భారాలు పడుతున్నాయి. అయినా అదికారుల్లో మాత్రం చలనం లేదు. డిస్ట్రిబ్యూటర్లు, సిబ్బంది, దళారులు, అధికార యంత్రాంగం కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా ఈ దందాను నడుపుతున్నారని సమాచారం. అధికారుల అండదండలు బలంగా ఉండటం వల్లే దళారులు రెచ్చిపోతున్నారని తెలిసింది. మరోవైపు కమర్షియల్ సిలిండర్ కావాల్సిన వినియోగదారులు... డిస్ట్రిబ్యూటర్‌కు లేదంటే ఏజెన్సీకి ఫోన్ చేస్తే సరఫరా చేస్తారు. డొమెస్టిట్ సిలిండర్‌ను మాత్రం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇది సాధారణంగా జరిగే ప్రక్రియ. కానీ ఇప్పుడు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో లేదా ఫోన్‌లో ఎలా బుక్ చేసినా ధరాభారం మాత్రం తప్పటం లేదు. **రీఫిల్లింగ్ దందా...** గ్యాస్ సిలిండర్ ధరలను భరించలేక హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని కొన్ని వందల హోటళ్లు, టిఫిన్ సెంటర్స్, రెస్టారెంట్లను నెలక్రితమే మూసేశారు. అందులో ఇప్పటికీ చాలా వాటిని తెరవలేదు. యుద్ధ తీవ్రత తగ్గి.. పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకుంటున్నప్పటికీ గ్యాస్ దందా మాత్రం అలాగే కొనసాగుతోంది. గ్యాస్ అక్రమ నిల్వలను ఆరికట్టాల్సిన అధికార యాంత్రాంగం దళారులకే వత్తాసు పలుకుతోంది. దీనికితోడు డొమెస్టిక్ సిలిండర్ల నుంచి గ్యాస్‌ను కమర్షియల్ సిలిండర్లకు రీఫిల్లింగ్ చేసి, ఆ మేరకు ధర పెంచి దండుకుంటున్న ఘటనలు అనేకం వెలుగు చూశాయి. ఇదే సమయంలో బుకింగ్ కావడం లేదంటూ ప్రచారం చేయటం, బుకింగ్ అయినప్పటికీ స్టాక్ లేదని చెప్పడం, కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరకు అమ్ముకోవటం తదితర పద్ధతుల్లో వినియోగదారుల నుంచి దందారాయుళ్లు భారీగా దండుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పౌర సరఫరాలశాఖ దీనికి అడ్డుకట్ట వేస్తుందా? లేదా? అనేది చూడాలి.

# కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం: రైతులకు ఎమ్మెల్యే భరోసా...







**తిమ్మాపూర్,ఏప్రిల్26(పీసీడబ్ల్యూ న్యూస్):** రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేసినట్లు మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వరి దిగుబడులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో కొనుగోళ్లను ముమ్మరం చేస్తున్నామని, ఈ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు జాప్యం లేకుండా రైతుల నుండి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి పంపించాలని సూచించారు. రైతులు దళారులకు మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించి, ప్రభుత్వం కల్పించే మద్దతు ధరను పొందాలని ఆయన కోరారు. **బీరప్ప మహంకాళి గుడి పునర్నిర్మాణానికి భూమి పూజ** పర్లపల్లి గ్రామంలో బీరప్ప మహంకాళి గుడి పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, సర్పంచ్ స్వప్న రాజేందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు కాసర్ల సంపత్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ ఎంపీపీలు శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, అలాగే పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# హిందూధర్మం అంటే మతం కాదు, జీవన విధానం...

**- ఆర్ఎస్ఎస్ జిల్లా సహ సంఘచాలక్ ఎలగందల సత్యనారాయణ**









**మానకొండూర్,ఏప్రిల్26(పిసిడబ్ల్యూ న్యూస్):** హిందూధర్మం అంటే మతం కాదు, జీవన విధానం అని ఆర్ఎస్ఎస్ జిల్లా సహ సంఘచాలక్ ఎలగందల సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ ఉప మండలం ,శ్రీరామ హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ ప్రోగ్రాంకుముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎస్ఎస్ జిల్లా సహ సంఘచాలక్ ఎలగందల సత్యనారాయణ మాట్లాడుతూ హిందూ ధర్మం, సనాతన ధర్మం కు శాశ్వత చిరునామా భారతదేశమే అన్నారు. అందుకే ప్రపంచ దేశాల్లో అన్నింటికంటే భారత దేశానికి ఓ ప్రత్యేకత ఉందన్నారు. ప్రతి ఒక్కరూ హిందూ సంస్కృతి సంప్రదాయాలుకాపాడుకోవాలన్నారు. దేశ ప్రగతికి సత్యం, ధర్మం వంటి విలువలను ఆచరించడం అవసరమని తెలిపారు. పంచ పరివర్తనల ద్వారా సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, ఆ దిశగా ముందుకు కొనసాగాలని తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు. హిందూ సమాజం ఐక్యత తో ఉండాలన్నారు. హిందూ ధర్మ రక్షణ, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవడానికి నడుం బిగించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. హిందూ సమ్మేళన సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హిందూ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ అల్పాహారం, మజ్జిగ ను అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ హిందూ సమ్మేళన సమితి అధ్యక్షులు సరఫ్ రామకృష్ణ, గర్రెపల్లిమహేశ్వర శర్మ అయ్యగారు, మహిళా వక్త అనుపమ లతో పాటు సదాశివ పల్లి, మానకొండూర్ , ముంజంపల్లి, శ్రీనివాస్ నగర్, జగ్గయ్యపల్లి, లింగాపూర్, ఈదులగట్టపల్లి,గ్రామాల హిందూ బంధువులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నేడు బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణలు పండుగల జరగాలి

**గ్రామ గ్రామాన బీఆర్ఎస్ జెండా వేడుకలు నిర్వహించాలి నాయకుల పిలుపు**

**కేసీఆర్, కేటీఆర్ పిలుపు మేరకు కల్లూరులో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణలు**

**కల్లూరులో బీఆర్ఎస్ శక్తి ప్రదర్శనకు సన్నాహాలు**

**ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలి**

**మాజీ జెడ్పిటిసి కట్టా అజయ్ కుమార్**



**కల్లూరు, ఏప్రిల్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రతి గ్రామంలో పండుగ వాతావరణంలో జెండా ఆవిష్కరణలు నిర్వహించి పార్టీ ఐక్యతను చాటాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ జెడ్పిటిసి కట్ట అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. కల్లూరు మండలంలో గ్రామ గ్రామాన బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణలను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ మండల పార్టీ పిలుపునిచ్చింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధకులు, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. రాష్ట్ర నాయకులు, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య ఆదేశాల మేరకు, వారి నాయకత్వంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి కల్లూరు మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతి గ్రామంలో స్థానిక బీఆర్ఎస్ శాఖల ఆధ్వర్యంలో జెండా దిమ్మెలను ఏర్పాటు చేసి, పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలా జరపాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాజీ జెడ్పిటిసి కట్టా అజయ్ కుమార్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం కీలకంగా ఉంటుందని అన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ జెండా ఆవిష్కరణలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే కల్లూరు మున్సిపాలిటీ, మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, గ్రామ, మండల స్థాయి ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు అందరూ పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రతి గ్రామంలో పండుగ వాతావరణంలో జెండా ఆవిష్కరణలు నిర్వహించి పార్టీ ఐక్యతను చాటాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలో పార్టీకి మరింత బలాన్ని చేకూర్చడమే కాకుండా, ప్రజలతో అనుబంధాన్ని పెంపొందించుకునే అవకాశం కలుగుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పోలీసుల దాతృత్వం మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం



**తల్లాడ, ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సాధారణంగా పోలీసులు చట్టం అమలు చేసే బాధ్యతతో మాత్రమే కాకుండా, సమాజంలో మానవత్వాన్ని కాపాడే సేవా దృక్పథంతో కూడా ముందుంటారని తల్లాడ మండలంలోని మల్లారం గ్రామ పోలీసులు మరోసారి నిరూపించారు. ఇబ్బందుల్లో ఉన్న ఒక కుటుంబానికి వారు అందించిన సహాయం పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. తల్లాడ మండలంమల్లారం గ్రామానికి చెందిన షేక్ యాకుబ్ పాషా ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, కాలు విరిగిపోవడంతో కదల్లేని స్థితికి చేరుకున్నారు. కుటుంబానికి ఆదాయం నిలిచిపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గమనించిన స్థానిక పోలీసులు మానవత్వంతో ముందుకు వచ్చి ఆదివారం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ సమాజంలో ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు చేయూత ఇవ్వడం మన బాధ్యత ప్రజలతో మమేకమై వారి సమస్యలను అర్థం చేసుకుని సహాయం చేయడం పోలీసుల అసలు ధర్మం అని తెలిపారు. వారి ఈ చర్య గ్రామ ప్రజల మనసులను కదిలించడమే కాకుండా, సేవా భావం ఉన్న ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో గాదె రంజిత్, కుంచం రాంప్రసాద్, దుగ్గి దేవర ముత్యాలరావు, పసుపులేటి ప్రసాద్ తదితర పోలీసులు పాల్గొన్నారు. పోలీసులు చూపిన ఈ దాతృత్వం సమాజంలో సహకారం, పరస్పర మద్దతు ఎంత ముఖ్యమో మరోసారి గుర్తుచేస్తూ, మరెందరికో ప్రేరణగా మారింది.

# విద్యార్థుల సమస్యల పరిష్కారానికి బిఆర్ఎస్వీ పోరుబాట




**పరకాల, ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాట కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. బీఆర్ఎస్వీ నిర్వహించనున్న పోరుబాటకు సంబంధించిన పోస్టర్‌ను హనుమకొండలోని తన నివాసంలో బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పోచంపల్లి రఘుపతి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని తీవ్రంగా విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద సుమారు రూ.8 వేల కోట్ల బకాయిలను చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో దాదాపు 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు కళాశాలలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో వారు ఉన్నత విద్య లేదా ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల సమస్యల దృష్ట్యా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర, కాకతీయ యూనివర్సిటీ రజక సంఘం ఇన్‌చార్జ్ కోరపెల్లి రాజేష్, బొమ్మ ఉజ్వల్, నడికూడ మండల అధ్యక్షుడు ధురిశెట్టి రేవంత్, పరకాల రూరల్ అధ్యక్షుడు గొట్టే అజయ్, కంటత్మకూర్ గ్రామ అధ్యక్షుడు గుడికందుల శివ, ఐలోని అభిషేక్, గంద్రకోట పవన్ తదితరులు పాల్గొన్నారు.

# సైక్లింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా బొచ్చు రాకేష్ ఏకగ్రీవ ఎన్నిక




**హనుమకొండ, ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు ఘనంగా నిర్వహించగా, కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. JNS Stadiumలో నిర్వహించిన నూతన కమిటీ ఏర్పాటు సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, హనుమకొండ జిల్లా క్రీడా అధికారి, సంస్థ పరిశీలకుడు మరియు రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అబ్జర్వర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తగా ఏర్పడిన ఈ కమిటీ 2026 నుండి 2030 వరకు నాలుగు సంవత్సరాల పాటు పదవీకాలాన్ని నిర్వహించనుంది. హనుమకొండ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా బొచ్చు రాకేష్ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మరియు అబ్జర్వర్లు బొచ్చు రాకేష్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# కురవి , సీరోల్ కేంద్రాల్లో మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**● జిల్లా కలెక్టర్‌కు సీపీఐ కురవి పట్టణ కార్యదర్శి తురుక రమేష్ విన్నపం**




**కురవి, ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా కురవి, సీరోలు మండల కేంద్రాల్లో తక్షణమే మొక్కజొన్న (మక్కల) కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఐ కురవి పట్టణ కార్యదర్శి తురుక రమేష్ ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. గత ఏళ్లతో పోలిస్తే ఈ ఏడాది రైతులు మొక్కజొన్న పంటను అత్యధిక విస్తీర్ణంలో సాగు చేశారని తెలిపారు. అయితే, మండల కేంద్రాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే తరుణంలో గ్రామాలపై పడుతున్న దళారులు, మద్దతు ధర కంటే తక్కువకే పంటను కొనుగోలు చేస్తూ రైతులను నిలువునా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మార్కెట్ యార్డులు దూరంగా ఉండటం వల్ల రవాణా ఖర్చులు పెరిగి రైతులకు ఆర్థిక భారం మిగులుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు దక్కాలంటే మండల కేంద్రాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఉండాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ గారు సానుకూలంగా స్పందించి, వెంటనే కురవి, సీరోలు మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను దళారుల బారి నుండి కాపాడాలని.తురకరమేష్. ఈ ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ హయాంలోనే పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు..

**● కొత్తూరు(సి)గ్రామ సర్పంచ్ బాదావత్ చిన్ని**



**కురవి ఏప్రిల్ 26(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండలం కొత్తూరు (సి) గ్రామానికి చెందిన జన్ను విజయ ఇందిరమ్మ ఇంటిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన గ్రామ సర్పంచ్ బాదావత్ చిన్ని.. ఈ సంధర్భంగా సర్పంచ్ చిన్ని మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.. త్వరలో ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ సహకారంతో గ్రామానికి రెండో విడతలో ఇందిరమ్మ గృహాలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమం లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు మలిశెట్టి వేణు.. వార్డు సభ్యులు కొంపెల్లి మల్లయ్య గౌడ్.. చిట్టూరి లక్ష్మి నారాయణ. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిప్పరపల్లి సైదులు. గోర్రెపాటి గుర్వయ్య. చిప్పరపల్లి అశోక్. యూత్ నాయకులు సూడి సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భోర్కడే హేమంత్ సహదేవరావు ఐఏఎస్



**ములుగు ప్రతినిధి ఏప్రిల్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆదివారం ములుగు జిల్లా నూతన కలెక్టర్‌గా భోర్కడే హేమంత్ సహదేవరావు ఐఏఎస్ జిల్లా కలెక్టరేట్‌లో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ ఓ రాజ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జై వాసవి మాతాకీ జై... వాసవి మాత జయంతి వేడుకలు



**గంగాధర ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించినాము ఇట్టి కార్యక్రమానికి నలుమాచుహరి కిషన్,రేగురి కరుణాకర్, తంశెట్టి శ్రీనివాస్, మంచాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి గంగాధర మండలంలోని ఆర్యవైశ్య సోదరి,సోదరులందరూ పాల్గొని విజయవంతం చేసినారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎమ్మార్వో రజిత, ఎస్సై వంశీకృష్ణ, మధురానగర్ సర్పంచ్ వేముల భాస్కర్ మరియు ఉప సర్పంచ్ తూము రాజు మరియు వార్డ్ మెంబర్లు అందరూ మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

## శ్రీ వాసవి కన్యక పరమేశ్వరిమాత జయంతి వేడుకలు




**గంగాధర ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులు మధురానగర్ సర్పంచి వేముల భాస్కర్ గౌరవనీయులు ఎస్సై వంశీకృష్ణ వచ్చేసి శ్రీ వాసవి మాత చిత్రపటానికి పుష్పమాల వేసినారు మరియు ఉపసర్పంచి తుము రాజు కాంగ్రెస్ నాయకులు దాతు ఆంజనేయులు వార్డ్ మెంబర్లు గంగాధర మండల అధ్యక్షుడు విశ్వనాథం నాగరాజు కోశాధికారి విశ్వనాథం రమేష్ గౌరవ అధ్యక్షులు కమటాల రమేష్ నలుమాచు హరికిషన్ మండల ఆర్యవైశ్య సోదరులందరూ విచ్చేశారు. వాడవాడలా బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది వాసవి మాత వేడుకలు ఘనంగా నిర్వహించినాము.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం: కల్లూరు విద్యుత్ శాఖ విజ్ఞప్తి

**కల్లూరు, ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు విద్యుత్ శాఖ పరిధిలోని సాంబయ్య బంజర ఫీడర్‌లో లైన్ సమీపంలో ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమం నేడు నిర్వహించనున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి మహేంద్ర బాబు తెలిపారు. ఈ పనుల దృష్ట్యా ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. దీంతో సాంబయ్య బంజర, కొర్లగూడెం, రామకృష్ణాపురం, కొత్త నారాయణపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. కావున సంబంధిత ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయాన్ని గమనించి, శాఖకు సహకరించాలని విద్యుత్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# లెమార్ ఎడ్యుకేషనల్ సొసైటీ 2వ వార్షికోత్సవం ఘనంగా

**విద్య, సంస్కృతి సమ్మేళనంగా**
**లెమార్ సొసైటీ వార్షికోత్సవ వేడుకలు**
**చిన్నారుల ప్రతిభకు వేదికగా**
**లెమార్ స్కూల్ వార్షికోత్సవం**
**విద్యార్థుల మెప్పించిన సాంస్కృతిక ప్రదర్శనలు**
**లెమార్ వేడుకలు విజయవంతం**
**బహుమతులతో విద్యార్థులకు ప్రోత్సాహం**
**చిన్నారుల పాటలు, నృత్యాలతో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**
**విజేతలకు బహుమతులు, ట్రోఫీలు పంపిణీ**
**సమగ్ర విద్యపై పాఠశాల యాజమాన్యం దృష్టి**







**కల్లూరు, ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** కల్లూరు పట్టణంలోని లెమార్ ఎడ్యుకేషనల్ సొసైటీ తన 2వ వార్షికోత్సవాన్ని పాఠశాల ప్రాంగణంలో అత్యంత వైభవంగా నిర్వహించింది. విద్యార్థుల ఉత్సాహం, తల్లిదండ్రుల భాగస్వామ్యం, ఉపాధ్యాయుల అంకితభావం మొత్తం కలిసి ఈ వేడుకను మరింత ప్రత్యేకంగా నిలిపాయి. ఈ కార్యక్రమానికి కల్లూరు రూరల్ సీఐ ముత్తు లింగయ్య ముఖ్య అతిథిగా విచ్చేయగా, మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఎస్సై డి. హరిత కిండర్ గార్టెన్ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించి గౌరవ అతిథిగా సన్మానించబడ్డారు. ఈ సభకు ముఖ్య అతిథులు హాజరైన సీఐ ముత్తు లింగయ్య విద్యా ప్రాధాన్యతను వివరించి, నేటి సమాజంలో నాణ్యమైన విద్య అవసరాన్ని గుర్తుచేశారు. పాఠశాల యాజమాన్యం ఛైర్మన్ అబ్బాస్ హసన్, కరస్పాండెంట్ ఎన్. సురేష్, డైరెక్టర్లు జాస్మిన్, శ్రీలక్ష్మి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం పాఠశాల నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, నైతిక విలువలు, సృజనాత్మకత, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పెంపొందించే సాధనమని వివరించారు. సమావేశం అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. చిన్నారుల పాటలు, నృత్యాలు, నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా చిన్నారులు ప్రదర్శించిన పాటలు, వారి నిర్దోషమైన అభినయం తల్లిదండ్రులను, అతిథులను మంత్రముగ్ధులను చేశాయి. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడంలో పాఠశాల చూపుతున్న శ్రద్ధ స్పష్టంగా కనిపించింది. ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించిన సాహిత్య, సాంస్కృతిక, క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ట్రోఫీలు, జ్ఞాపికలు అందజేశారు. విజేతలతో పాటు రన్నరప్‌లను కూడా ప్రోత్సహిస్తూ సమానంగా గౌరవించడం విశేషం. ఈ సందర్భంగా చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పాఠశాల ముఖ్య పాత్ర పోషిస్తుందని చెప్పారు. పిల్లలలో ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని సరైన దిశలో ప్రోత్సహించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. సమాజ నిర్మాణంలో మంచి విద్యాసంస్థల పాత్ర కీలకమని, లెమార్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆ దిశగా ముందుకు సాగుతోందని అభిప్రాయపడ్డారు. మొత్తానికి ఈ వార్షికోత్సవం విద్య, సంస్కృతి, విలువల సమ్మేళనంగా నిలిచి, పాఠశాల గొప్పతనాన్ని ప్రతిబింబించింది. విద్యార్థుల ప్రతిభ, ఉపాధ్యాయుల కృషి, యాజమాన్యం దూరదృష్టిమొత్తం కలిసి ఈ సంస్థను ప్రాంతంలో ఒక ఆదర్శ విద్యాసంస్థగా నిలబెడుతున్నాయని పాఠశాల యాజమాన్యం ను అభినందించారు.

# కాంగ్రెస్ పార్టీ గొప్ప సైనికుడిని కోల్పోయింది







**- జావేద్ మరణం నన్ను తీవ్రంగా కలచివేసింది**
**- జావేద్ కుటుంబం బాధ్యతను కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుంది**
**- భవిష్యత్తులో సమాజానికి ఎంతో సేవ చేయగలిగే వ్యక్తిని మనం కోల్పోయాం**
**- మహమ్మద్ జావేద్ సంస్మరణ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భావోద్వేగ ప్రసంగం**

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కాంగ్రెస్ పార్టీ గొప్ప సైనికుడిని కోల్పోయిందని, జావేద్ మరణం తనను తీవ్రంగా కలచివేసిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. దివంగత కాంగ్రెస్ నాయకుడు ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ జావేద్ మృతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సంస్మరణ సభలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొని భావోద్వేగంతో ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన జావేద్ సంస్మరణ సభలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు లు జావేద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ... మహమ్మద్ జావేద్ మరణం కాంగ్రెస్ పార్టీకి, ఖమ్మం జిల్లాకు తీరని లోటు అన్నారు. జావేద్ మరణ వార్త తనను ఎంతగానో కలచివేసిందని అన్నారు. భవిష్యత్తులో సమాజానికి ఎంతో సేవ చేయగలిగే వ్యక్తిని మనం కోల్పోయామని బాధాతప్త హృదయంతో పేర్కొన్నారు. నేను ఎప్పుడు ఖమ్మం పర్యటనకు వచ్చినా, పర్యటన ముగిసే వరకు జావేద్ తనతోనే ఉండేవారని అన్నారు. కానీ దురదృష్టవశాత్తు ఆరోజు సత్తుపల్లి, అశ్వరావుపేట పర్యటనలో ఆయన లేరని ఆవేదనతో చెప్పారు. విద్యార్థి (ఎన్.ఎస్.యు.ఐ) నాయకుడిగా, యువజన కాంగ్రెస్ నాయకుడిగా పార్టీ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న వ్యక్తి మహమ్మద్ జావేద్ అని డిప్యూటీ సీఎం కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ విలువలను, సిద్ధాంతాలను స్పష్టంగా వివరించే గొప్పవక్తగా




జావేద్‌ను భట్టి విక్రమార్క అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక వంటి సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా జావేద్‌ను నియమించేటప్పుడు ఆయన సామర్థ్యంపై తనకు పూర్తి నమ్మకం ఉందని చెప్పారు. ఆ బాధ్యతను ఆయన సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఏఐసీసీ ప్లీనరీ సమావేశాల్లో సేవాదళ్ యూనిఫాంలో క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ, జాతీయ స్థాయి నాయకుల దృష్టిని కూడా మహమ్మద్ జావేద్ ఆకర్షించారని గుర్తు చేశారు. జావేద్ మరణం పార్టీకి ఒక గొప్ప సైనికుడిని కోల్పోవడమేనని భట్టి విక్రమార్క నివాళులర్పించారు. జావేద్ కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, పార్టీ నిర్వహించే మేధోమథన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారన్నారు. అక్కడ నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి ప్రయత్నించేవారని తెలిపారు. రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్, సేవాగ్రామ్ వంటి శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొని, ఒక క్రమశిక్షణ కలిగిన సైనికుడిలా పార్టీ కోసం పనిచేశారని కొనియాడారు. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు, పెద్ద పదవుల్లో ఉన్నవారే పార్టీని వీడి వెళ్తున్న సమయంలో జావేద్ నిబద్ధతతో పార్టీలోనే కొనసాగారని గుర్తుచేశారు. పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని గుర్తించి, అందరినీ ఒప్పించి మరీ ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా జావేద్‌కు బాధ్యతలు అప్పగించామని చెప్పారు. గత పదేళ్లుగా జిల్లాలో పార్టీకి ఎమ్మెల్యేలు లేకపోయినా, ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా అధైర్యపడకుండా పోరాటాలు చేశారని భట్టి విక్రమార్క తెలిపారు. కార్యకర్తలను అరెస్ట్ చేసినా, పోలీసులు లాఠీచార్జ్ చేసినా వెరవకుండా, ఎవరికీ తలవంచకుండా పార్టీ సిద్ధాంతాల కోసం జావేద్ పనిచేశారని కొనియాడారు. ఖమ్మం నగరంలోని ప్రతి డివిజన్‌లో కమిటీలను వేసి, అధ్యక్షులను నియమించి, వారికి ఫోటోలతో కూడిన ఐడి కార్డులు ఇచ్చి పార్టీని వ్యవస్థీకృతం చేశారని ప్రశంసించారు. జావేద్ ఖమ్మంలో రూపొందించిన ఈ ఆర్గనైజేషన్ మోడల్‌ను చూసి, అప్పటి రాష్ట్ర పార్టీ ఇన్-ఛార్జ్ మాణిక్యం ఠాగూర్, ఇతర జిల్లా అధ్యక్షులు కూడా ఆశ్చర్యపోయారని అన్నారు. జావేద్ కుటుంబాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డిప్యూటీ సీఎం చెప్పారు. ఆ కుటుంబాన్ని ఏనాడూ ఒంటరి చేయబోమని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. జావేద్ ఇద్దరు పిల్లల బాధ్యతను పార్టీ తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, మహమ్మద్ జావేద్ కుమార్తెలు సహేల కుర్రత్, సబాహాత్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ లు నాయుడు సత్యనారాయణ, రాయల నాగేశ్వరరావు, వైరా శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, శాసనసభ మాజి సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణ కుమారి, జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ముక్తార్ జోహారా, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య, కార్పొరేటర్లు లకావత్ సైదులు నాయక్, మిక్కిలినేని మంజుల నరేందర్, మహ్మద్ ముస్తఫా రపేదాబేగం, కమర్తపు మురళీ, అగ్రిక ల్చర్ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు మానుకొండ రాధాకిషోర్, సుభాష్ యాత్రా, రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు బి యచ్ రబ్బానీ, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు, నగర కాంగ్రెస్ కమిటి కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఉప్పల్ రింగ్ రోడ్ రహదారి తాత్కాలికంగా మూసివేత..


**- ఎంజీబీస్,జగద్గిరిగుట్ట, జేబీఎస్ మినహా అన్ని డిపోల బస్సులు నల్లచెరువు వరకే...**

**- పోలీసుల సలహాలను పాటించాలి అంటున్న ఆర్టీసీ అధికారులు**

**- కార్గో పార్సెల్ సర్వీసులు నల్లచెరువు వరకు మార్చబడింది.**





**తొర్రూరు ప్రతినిధి,ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** గత కొద్దికాలం నుండి ఉప్పల్ రింగ్ రోడ్డు వరకు బస్సులు వెళ్లవు అని సమాచారం ముందుగానే తెలిసినప్పటికీ అధికారులు మాత్రం అధికారికంగా గతంలో ప్రకటించలేదు. ఉప్పల్ రింగ్ రోడ్ లో కారిడార్ రైల్వే పనులు జరుగుతున్న నేపథ్యంలో నేటి నుండి ఉప్పల్ రింగ్ రోడ్ వరకు వెళ్లే బస్సులను అన్నిటిని తాత్కాలికంగా నల్లచెరువు వరకే నడిపించడం జరుగుతుందని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. జగద్గిరిగుట్ట ,ఎంజీబీఎస్, జేబీఎస్ వెళ్లాల్సిన బస్సులను రోడ్డు మార్పిడి ద్వారా పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు.. ఉప్పల్ ఎక్స్ రోడ్ నుండి వరంగల్ వైపు వచ్చే రహదారిని పూర్తిగా మూసివేశారు. ఎవరైనా ఏ రూట్ వెళ్లాలన్న పోలీసుల సలహాలు సూచనలు పాటించాలని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. హైదరాబాద్ ,సికింద్రాబాద్ వెళ్లాల్సిన ప్రయాణికులు కొద్దికాలం ఇబ్బందులు పడవలసిందే అని ప్రయాణికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే పనులకు భారీ యంత్రాలు రైల్వే పనులకు ఇతర వాహనాలు ఇబ్బంది కలిగిస్తాయని రోడ్డు మార్పిడి చేయక తప్పలేదని అన్నారు. ప్రయాణికులు నల్లచెరువు ప్రాంతంలోని బస్సులు వెళ్లడం ద్వారా అక్కడి నుండి వివిధ ప్రాంతాలకు వెళ్లాలనుకున్నవారు సిటీ బస్సులు గాని ఇతర వాహనాల ద్వారా వెళ్లాల్సిందే?. ఈ ఇబ్బందులన్నీ కొద్దికాలం వరకు ప్రయాణికులు ఇబ్బంది పడక తప్పదని రైల్వే పనుల కారణంగా రహదారుల మార్పిడి తప్పనిసరి అయిందని ఆర్టీసీ అధికారులు తెలుపుతున్నారు. నల్ల చెరువు నుండి ఎల్బీనగర్ వరకు రోడ్ మార్పిడి చేశారు. ఆర్టీసీ డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేయకుండా ప్రయాణికులు అర్థం చేసుకొని ఆర్టీసీ అధికారులు తెలిపిన ప్రకారం ప్రయాణం చేయాల్సిందిగా కోరుతున్నారు. తొర్రూర్ డిపో నుండి దిల్ షుక్ నగర్ వయా చౌటుప్పల్ ద్వారా ఎంజీబీఎస్ వరకు బస్సులను నడిపించాలని కోరుతున్న ప్రయాణికులు?. ఉప్పల్ రింగ్ రోడ్‌లో పనులు నడుస్తున్న కారణంగా హైదరాబాదు సికింద్రాబాద్కు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తొర్రూర్ నుండి వలిగొండ, చౌటుప్పల్ , మార్గం ద్వారా ఎంజీబీఎస్ వరకు కొన్ని బస్సులనునడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# దయాల లక్ష్మి టీచర్ ప్రథమ వర్ధంతి....
# కల్లూరులో ఘన నివాళులు

● ఆదర్శ ఉపాధ్యాయురాలుకు ఘన నివాళులు

● విద్యా సేవలకు వందనం..: మున్సిపల్ ఛైర్మన్ మోహన్ నాయక్



**కల్లూరు, ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు పురపాలక సంఘ పరిధిలో ఆదివారం దయాల లక్ష్మి టీచర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆమె విద్యా సేవలను స్మరించుకున్నారు. ఆమె సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శీలం బ్రహ్మారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు యాస శ్రీకాంత్ నాగమణి, ఉబ్బన రాంబాబు పాల్గొని నివాళులు అర్పించారు. అలాగే కల్లూరు మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆలకుంట నరసింహారావు, నాయకుడు ప్రసాద్ రెడ్డి తదితరులు హాజరై ఆమె సేవలను కొనియాడారు.దయాల లక్ష్మి టీచర్ విద్యార్థుల అభివృద్ధి కోసం చేసిన కృషి ఆదర్శప్రాయమని, ఆమె మార్గదర్శకత్వం ఎంతో మందికి ప్రేరణగా నిలిచిందని వక్తలు పేర్కొన్నారు. ఆమె మరణం విద్యా రంగానికి తీరని లోటని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు దయాల లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ నివాళులు అర్పించారు.

# ప్రజాసేవ కోసమే రాజకీయ రంగప్రవేశం: ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి







**హనుమకొండ,ఏప్రిల్26(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రజలకు విస్తృతంగా సేవలు అందించాలనే లక్ష్యంతోనే తాను రాజకీయ రంగంలోకి ప్రవేశించానని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు.ఆదివారం హనుమకొండలోని కాకతీయ వైద్య కళాశాల 1984 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైద్య వృత్తిలో ఉన్నప్పటికీ మరింత మంది ప్రజలకు సేవలు అందించాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. దీర్ఘకాలం తర్వాత పాత మిత్రులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్న ఆయన, ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. కాకతీయ మెడికల్ కాలేజ్ దశాబ్దాల వారసత్వం కలిగిన విశ్వసనీయ సంస్థగా ప్రత్యేక గుర్తింపు పొందిందని, ఇది కేవలం విద్యాసంస్థ మాత్రమే కాకుండా ఆరోగ్య సంరక్షణ, శిక్షణ, పరిశోధనలలో గొప్ప సేవలు అందిస్తున్నదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులతో అనుబంధం వల్ల విద్యార్థులకు పటిష్టమైన క్లినికల్ అనుభవం లభిస్తుందని, అందువల్ల నీట్ అర్హత సాధించిన విద్యార్థులకు ఇది అగ్రశ్రేణి ఎంపికగా నిలుస్తుందని తెలిపారు. ఈ కళాశాలలో చదివిన అనేక మంది వైద్యులు జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందుతున్నారని గుర్తు చేశారు.తాను కూడా వైద్యుడిగా స్థిరపడి పేదలకు ఉచిత వైద్య సేవలు అందించిన విషయాన్ని ప్రస్తావించిన ఆయన, సేవాభావంతో ప్రజలకు మరింత ఉపయోగపడాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. తన సేవలను గుర్తించిన మానకొండూర్ ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించారని, వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నానని చెప్పారు.తాను కాకతీయ మెడికల్ కాలేజ్ విద్యార్థి కావడం గర్వకారణమని పేర్కొన్న ఆయన, అనంతరం పాత మిత్రులతో కలిసి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమ భవిష్యత్తును తీర్చిదిద్దిన గురువులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సమ్మేళన నిర్వాహకులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఆయన సతీమణి డాక్టర్ కవ్వంపల్లి అనురాధలను ఘనంగా సన్మానించారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సండ్ర



**కల్లూరు, ఏప్రిల్ 26 (పీసీడబ్ల్యూ న్యూస్):** కల్లూరు గ్రామానికి చెందిన ఎస్.కే. జానీమియా కుమారుడు ఎస్.కే. ఆల్తాబ్ వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి దాంపత్య జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వధూవరులను అభినందించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు సమక్షంలో వివాహ వేడుక ఆనందోత్సాహాల మధ్య కొనసాగింది. కార్యక్రమం సాంప్రదాయబద్ధంగా నిర్వహించబడగా, అతిథులకు ఆతిథ్యం అందించారు. జిల్లా నాయకులు కనగాల వెంకట్రావు, మున్సిపల్ కౌన్సిలర్ మండల యువజన అధ్యక్షులు పెడకంటి రామకృష్ణ, కౌన్సిలర్ ఇస్మాయిల్, సీనియర్ నాయకులు మేకల కృష్ణ, కిరణ్, కట్టా అర్లప్ప, కమ్లి, రావూఫ్, ఇసాక్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

# రంగ వైభవంగా శ్రీ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం





**రామడుగు ఏప్రిల్ 26 (పిసి డబ్ల్యూ న్యూస్):** రామడుగు మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర ఆలయ కమిటీ చైర్మన్ పెందోట రాజు ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అభిషేకం,హోమం,మహా నైవేద్యం,భజన ,అన్నప్రసాధ వితరణ కార్యక్రమాలు అంగ రంగ వైభవంగా చేపట్టారు. ఇట్టి కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఉప సర్పంచ్ పెందోట రాజు తన స్వంత ఖర్చులతో చేయడం జరిగింది. ఇందులకు గాను భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆ వేడుకల అనంతరం శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ,ఉప సర్పంచ్ పెందోట రాజు మరియు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఆధ్వర్యంలో రామడుగు గ్రామ సర్పంచ్ మహమ్మద్ మొహిజ్ ఉప సర్పంచ్ పెందోట రాజు గ్రామపంచాయతీ పాలకవర్గం వార్డు సభ్యులు కర్నె శ్రీలత - శ్రీనివాస్, సిరిగిరి వెంకటేశం, మ్యాడారం అర్చన - అనిల్,నీలం అరుణ - లక్ష్మణ్,రాగం స్వప్న - రవి, ఎండీ ఆరిఫ్, మామిడి కుమార్, సామంతుల సుజాత - తిరుపతి,మామిడి దిలీప్ కుమార్, మామిడి శ్రవణ్, కారుపాకల నరేష్, చంద అనిల్,సిరికొండ పల్లవి - సాయి తేజ గార్లకు దేవాలయంలో భక్తుల సమక్షంలో శాలువాలతో సన్మానించి సత్కరించడం జరిగింది.

# పల్లె ప్రజల ప్రాణాధారంగా గ్రామీణ వైద్యులు


**● పల్లె జనుల ప్రాణబంధువులకు గుర్తింపునివ్వాలి ● తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్ ● గ్రామీణ ప్రజల ఆరోగ్య రక్షణకు గ్రామీణ వైద్యుల ఐక్య స్వరం ● ఘనంగా తల్లాడ మండల గ్రామీణ వైద్యుల మహాసభ ● హక్కులు, గుర్తింపు కోసం డిమాండ్ల వెల్లువ ● సేవలకు తగిన గౌరవం చట్టబద్ధత కల్పించాలి ● గ్రామీణ ఆరోగ్య ప్రదాతల గళం ● ప్రభుత్వ స్పందన కోరుతూ పిలుపు**








**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పల్లె ప్రజల ప్రాణాధారంగా గ్రామీణ వైద్యులు పనిచేస్తున్నారని, పల్లె జనుల ప్రాణబంధువులకు గుర్తింపునివ్వాలని తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు దాసరి నరేష్, తాళ్లూరి నరసింహారావు లు అన్నారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం తల్లాడ మండల మహాసభ ఆదివారం ఖమ్మం జిల్లా, తల్లాడలో ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలో రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు దాసరి నరేష్, తాళ్లూరి నరసింహారావు లు మాట్లాడుతూ... గ్రామీణ వైద్యుల సేవలను గుర్తించాలని, వారి హక్కులను పరిరక్షించాలని, ప్రభుత్వానికి పలు కీలక డిమాండ్లు చేశారు. పల్లెల్లో ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోయినా, అత్యవసర సమయంలో గ్రామీణ వైద్యులే ప్రజలకు ప్రాణాధారంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అయితే, అలాంటి సేవలు అందిస్తున్న వారిపై కేసులు నమోదు చేయడం, దాడులు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ వైద్యుల సేవలకు చట్టబద్ధత కల్పించి, గౌరవప్రదమైన గుర్తింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. 2015లో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 428 ద్వారా అనుభవం ఉన్న గ్రామీణ వైద్యులకు ఇచ్చిన శిక్షణ, ప్రాథమిక చికిత్సకు అనుమతిని యథావిధిగా కొనసాగించాలని స్పష్టం చేశారు. అలాగే తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తరపున జరుగుతున్న దాడులను వెంటనే నిలిపివేయాలని, పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. గ్రామీణ వైద్యుల హక్కుల సాధనలో ఐక్యతే ప్రధాన ఆయుధమని, అందరూ కలిసికట్టుగా పోరాడితేనే ఫలితాలు సాధ్యమని సంఘ నాయకులు పిలుపునిచ్చారు. పల్లె ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే ఈ సేవా వృత్తికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి నరసింహారావు, రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నారపు నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు మ్రరి నరేష్ తదితరులు పాల్గొని గ్రామీణ వైద్యుల సమస్యలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల అందుబాటు పెంపుకు గ్రామీణ వైద్యుల పాత్ర మరింత కీలకమని, వారి సేవలకు తగిన గౌరవం లభిస్తేనే పల్లె ప్రజల ఆరోగ్య భద్రత బలోపేతం అవుతుందని ఈ మహాసభ స్పష్టం చేసింది. అనంతరం సంఘ సభ్యులకు రూ. 10లక్షల ప్రమాద భీమా ఇన్సూరెన్స్ బాండ్ అందజేశారు. సంఘంలో చేరిన సీనియర్ గ్రామీణ వైద్యులకు ఐడి కార్డులు అందజేశారు. సభ అనంతరం సీనియర్ గ్రామీణ వైద్యులను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మ్రరి నరేష్, జిల్లా సాంస్కృతిక అధ్యక్షులు తుప్పతి శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు టి.వీ.కే చారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కాకటి కరుణాకర్, జిల్లా గౌరవ అధ్యక్షులు శీలం బాలకృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్దిరెడ్డి రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చాపలమడుగు నాగేశ్వరావు, తల్లాడ మండల అధ్యక్షులు షేక్ సైదా, మండల ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్ జానీ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చిరసాని రామకృష్ణ, తల్లాడ మండల కార్యవర్గ సభ్యులు చిరసాని రామారావు, మండల కార్యవర్గ సభ్యుడు షేక్ ఇబ్రహీం, మండల కార్యవర్గ సభ్యుడు గుడిమల్ల సతీష్ కుమార్, మండల కార్యవర్గ సభ్యుడు రాంబాబు, మండల కార్యవర్గ సభ్యుడు వేల్పుల ప్రవీణ్, కల్లూరు మండల అధ్యక్షులు ఆర్.వి.బి చారి, మండల కార్యవర్గ సభ్యుడు మనోజ్ కుమార్, మండలం కార్యవర్గ సభ్యులు ధర్నాల లోకేష్, వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు వింజమూరు విశ్వ ప్రకాష్ పాల్గొన్నారు.



# నూతన వధూవరులకు నూతన వస్త్రాలు బహుకరణ



**తల్లాడ, ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండల పరిధిలోని అంజనాపురం గ్రామంలో నూతన వధూవరులకు గ్రామ పంచాయతీ తరపున నూతన వస్త్రాలను బహుకరించారు. గ్రామానికి చెందిన ఆదూరి వెంకటేశ్వర్లు, వసంత దంపతుల ఏకైక కుమారుడు ఆకర్ష్ వివాహ వేడుకలో పాల్గొన్న గ్రామ పెద్దలు వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నల్లగొర్ల రాధాకృష్ణయ్య, ఉప సర్పంచ్ కేతినేని చలపతిరావు తదితరులు వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో కిన్నెర వెంకటేశ్వర్లు, అంకోలు వెంకటేశ్వర్లు, భూక్య బాలు, రామారావు, గోపి, జోగయ్య తదితరులు పాల్గొన్నారు. వివాహ వేడుక సాంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది.

# మోడీ సరళీకరణ విధానాలతో ముప్పు








**రైతు వ్యతిరేక చట్టాలను తిప్పుకొట్టడంలో ఏఐకేఎస్ కీలకం**

**బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో 10 లక్షల ఆత్మహత్యలు**

**సహజ పోరాట యోధుడు ఏలూరి లక్ష్మీనారాయణ**

**ఎర్రజెండా ముద్దుబిడ్డ ఏలూరి' పుస్తకావిష్కరణ సభలో సీపీఐ (ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు విజ్జుకృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని**

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న సరళీకరణ ఆర్థిక విధానాలు దేశానికి ముప్పుగా పరిణమించాయని సీపీఐ (ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు విజ్జుకృష్ణన్ పేర్కొన్నారు. ఈ విధానాల కారణంగా బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో 10 లక్షల మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సరళీకరణ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించటంలో ఏఐకేఎస్ కీలకంగా వ్యవహరించిందని చెప్పారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తిప్పి కొట్టడంలో ఏఐకేఎస్ పోషించిన పాత్ర రైతు సంఘాల ప్రశంశలు అందుకుందని వివరించారు. మార్క్సిస్టు యోధుడు ఏలూరి లక్ష్మీనారాయణ 34వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'ఎర్రజెండా ముద్దుబిడ్డ ఏలూరి' పుస్తకావిష్కరణ సభకు విజ్జుకృష్ణన్, సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావుతో కలిసి మాట్లాడారు. మోడీ పాలనలో ఆదివాసీలు, దళితులపై దాడులు అధికమయ్యాయి అని అన్నారు. మహారాష్ట్రలో రైతుల దుస్థితి గురించి చెబుతూ... నాసిక్ నుంచి ముంబై వరకు సాగిన యాత్ర ఘటనలను ఉదాహరించారు. **1930 నాటి పరిస్థితులు పునరావృతం :** 1930 నాటి పరిస్థితులు పునరావృతం అవుతున్నాయని విజ్జుకృష్ణన్ వ్యాఖ్యానించారు. 1933లో హిట్లర్ ఫాసిస్ట్ పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. పాసిజానికి వ్యతిరేకంగా సోవియట్ యూనియన్ నిలిచిందన్నారు. అదే సమయంలో ఏలూరి లక్ష్మీనారాయణ వంటి కమ్యూనిస్టు యోధులు ఉద్యమ అరంగేట్రం చేశారని తెలిపారు. రాయల్ సోల్జర్లా వ్యవహరించి నియంత పోకడలను తిప్పికొట్టగలిగారని చెప్పారు. ఉద్యమం లేని చోట సృష్టించటం గొప్ప విషయమని పేర్కొన్నారు. నేటి నాయకత్వం నాటి నాయకత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. **పోరాట స్ఫూర్తిని రగిలించిన నాయకులు ఏలూరి :** 'మీరు ఎక్కడ కూర్చున్నారు అక్కడే కూర్చుంటే మీ కాళ్లకు ఉన్న సంకెళ్ల గురించి తెలియదు... మీరు ఎప్పుడైతే కదులుతారో అప్పుడే ఆ సంకెళ్ల గురించి తెలుస్తుంది' అలా నిరంతరం కదిలి పోరాట స్ఫూర్తిని రగిలించిన వ్యక్తి ఏలూరి లక్ష్మీనారాయణ... ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని పోరాడాలని పిలుపునిచ్చారు. ఏలూరి తండ్రి అనంతరామయ్య స్వాతంత్ర్య సమరయోధులు బహుశా ఆయన తండ్రే ఆయనకు స్ఫూర్తి అయి ఉండవచ్చు. ఏలూరి సతీమణి జయమ్మ గారు నిర్వహించిన పాత్ర చెప్పుకో దగినది. బండారు చందర్ రావు, బత్తుల భీష్మారావు వంటి వారితో కలిసి ఉద్యమాన్ని కాపాడటానికి ఏలూరి పాటుపడిన విధానం స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఏలూరి లక్ష్మీనారాయణకు విప్లవ జోహార్లు తెలిపారు. **మోడీ ఆర్థిక విధానాలు – మతోన్మాదంతో ప్రమాదం : తమ్మినేని** మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు – మతోన్మాదం దేశానికి తీవ్ర ప్రమాదం అని సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం హెచ్చరించారు. మోడీ బానిసత్వం వల్ల ప్రపంచానికి నాయకత్వం వహించే అవకాశాన్ని ఇండియా కోల్పోతుందని చెప్పారు. ప్రజల్లో ఉన్నాడా? లేదా? అనేదే కమ్యూనిస్టుకి ప్రామాణికమని, అలా ప్రజల్లో ఉండి పోరాడిన యోధుడు ఏలూరి లక్ష్మీనారాయణ అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమానికి ఆటుపోట్లు ఎప్పుడూ ఉంటాయని, కష్టాలు వచ్చినప్పుడు నిలబడిన వాడే నిజమైన కమ్యూనిస్టన్నారు. ఐదువేల సంవత్సరాల నాగరికత ఉన్న ఇరాన్ ను నాశనం చేయాలనే అమెరికా కుట్రను ఇరాన్ తిప్పి కొడుతోందంటే... దీని వెనుక చైనా, ఎర్ర జెండా ఉండటమే కారణమన్నారు. అమెరికా దెబ్బతిన్నాక డాలర్ దెబ్బతినక తప్పదని, ప్రపంచం కమ్యూనిజం వైపు చూడటం తథ్యమన్నారు. సామ్రాజ్య వాదాన్ని వ్యతిరేకించే రీతిలో మోడీ లేదని తెలిపారు. ఏలూరి లక్ష్మీనారాయణ స్ఫూర్తితో ముందుకు సాగాలని చెప్పారు. ఏలూరి సతీమణి జయమ్మ, కూతుళ్లు అరుణ, వరలక్ష్మికి తమ్మినేని సానుభూతి ప్రకటించారు. **ఉత్తమ కమ్యూనిస్టు లక్షణాలన్నీ ఏలూరిలో... : పోతినేని** ఉత్తమ కమ్యూనిస్టు లక్షణాలన్నీ ఏలూరి లక్ష్మీనారాయణ లో ఉన్నాయని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. ఏలూరి జీవితాంతం వర్గ పోరాటాలే నిర్వహించారని, వాటిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. వెళ్లిన చోటల్లా దాడులు జరుగుతున్నా ఏమాత్రం వెరవకుండా ముందుకు వెళ్లారని తెలిపారు. నిరంతరం అధ్యయనం చేసేవారన్నారు. త్యాగం, ధైర్యం ఉత్తమ కమ్యూనిస్టు లక్షణం అన్నారు. ఇంకా ఈ సభలో 'ఎర్రజెండా ముద్దుబిడ్డ ఏలూరి' పుస్తక రచయిత పి. సోమయ్య, ఏలూరి సహచరుడు రాజారావు, సీనియర్ నాయకురాలు బత్తుల హైమావతి, నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ ఆనందా చారి, ఏలూరి చిన్న కూతురు వరలక్ష్మి, పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా ఇన్చార్జి పిట్టల రవి, సీనియర్ నాయకులు ఎం. సుబ్బారావు తదితరులు మాట్లాడారు. సభలో సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్, అన్నవరపు కనకయ్య, బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, బొంతు రాంబాబు,భూక్యా వీరభద్రం, యర్రా శ్రీనివాస్ రావు, బండి పద్మ, మెరుగు సత్యనారాయణ పాల్గొన్నారు.

---

# జనగణనలో ఖచ్చితత్వం, ప్రమాణాలను తూచా పాటించాలి

**ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే. ఆర్. మాధవి రెడ్డి**

**ఘనంగా సాగిన "సెన్సస్ 2027 సర్వే 2కే రన్ ర్యాలీ**







**కడప,ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాచారం సేకరణలో ఖచ్చితత్వం మరియు ప్రమాణాలను అందించడం ద్వారా.. మన దేశ భవిష్య ఆర్థిక ప్రణాళికకు చక్కటి మార్గదర్శకాలు అందుతాయని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం ఉదయం జిల్లా ప్రజల్లో జనగణన 2027పై విస్తృత అవగాహన కల్పించే ఉద్దేశంతో 5కే రన్ కార్యక్రమాన్ని జిల్లా పరిపాలన యంత్రాంగం, కేఎంసి ఆధ్వర్యంలో.. వివిధ శాఖల సమన్వయంతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై సెన్సెస్ 2027 అవగాహన కల్పించే.. 2k రన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనగణన దేశ అభివృద్ధికి అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ప్రతి పౌరుడు ఖచ్చితమైన వివరాలను సమర్పించడం ద్వారా ప్రభుత్వ పథకాల రూపకల్పనకు చక్కటి మార్గదర్శనం ఏర్పడుతుందన్నారు. అందుకు ప్రతి ఒక్కరు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు జనగణనలో సక్రమంగా పాల్గొని, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 2027 జనాభా గణనను సమగ్రంగా డిజిటల్ విధానంలో నిర్వహించాలన్నారు. అదేవిధంగా, హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ యాప్ యొక్క ముఖ్య ఫీచర్లు, వినియోగ విధానం పై ఆమె ప్రజలకు వివరించారు. స్వీయ గణన విధానపు ప్రాముఖ్యతను, దాని ద్వారా సమయపాలన, ఖచ్చితత్వం, పారదర్శకత వంటి ప్రయోజనాలను వివరించారు.2027 జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని తెలిపారు. మొదటి దశలో ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన మరియు రెండవ దశలో జనాభా గణన నిర్వహించబడుతుందన్నారు. రెండవ దశలో కుల గణన కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. మొదటి దశను మే 1 నుంచి మే 30 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ దశలో ఇంటి నిర్మాణానికి ఉపయోగించిన మెటీరియల్, ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, త్రాగునీటి సౌకర్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం, అలాగే రేడియో, టెలివిజన్, స్మార్ట్ఫోన్, కంప్యూటర్, సైకిల్, కారు తదితర సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నల వివరాలను ఎన్యుమరేటర్ ప్రతి ఇంటికి వెళ్లి సేకరించే విధానాన్ని వివరించనున్నట్లు తెలిపారు. అలాగే, ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్లైన్లో నమోదు చేసుకొనేందుకు ప్రత్యేక పోర్టల్ అందుబాటులో వుందన్నారు.కార్యక్రమంలో ముందుగా ఎమ్మెల్యే మాధవి రెడ్డి పచ్చ జెండా ఊపి.. సెన్సెస్ 2027 5k రన్ ర్యాలీని ప్రారంభించారు. జిల్లా కలెక్టరేట్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ.. పలు ప్లకార్డులు, బ్యానర్లు పాటలతో నగరంలోని పలు ప్రధాన కూడళ్ల మీదుగా 7 రోడ్ల సర్కిల్ వరకు సాగింది.ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్వో వెంకటపతి, కడప నగరపాలక సంస్థ కమీషనర్ రాకేష్ చంద్రం, సెన్సస్ జిల్లా ఇంచార్జి మోహన్ రమణ, స్థానిక నాయకులు ఆర్.శ్రీనివాస రెడ్డి, రెడ్డెయ్య జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రజాప్రతినిధులు, ఎన్జీవో ప్రతినిధులు, మెప్మా మహిళలు,విద్యార్థులు, యువత, క్రీడాకారులు పాల్గొన్నారు.

---

# అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

**• ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అంకాలమ్మ తల్లి**



**పులివెందుల ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పులివెందల పట్టణం పార్నపల్లి రోడ్డు సమీపంలో నడిబొడ్డున కొలువై ఉన్న అంకాలమ్మ తల్లికి ఆదివారం పర్వదినాన ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయాస్తమాన అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన,తదితర పూజా కైకర్యాల అనంతరం పట్టు వస్త్రాలతో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు అందుకొని మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని,ప్రతి ఆదివారం ఆలయానికి వస్తున్నటువంటి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేస్తూ జాగ్రత్తలు వహిస్తున్నామని తెలిపారు.అనంతరం ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు ఎండోమెంట్ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరులో వైభవంగా వాసవి కన్యకా పరమేశ్వరి దినోత్సవ వేడుకలు

**చెన్నూరు ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మండల కేంద్రమైన చెన్నూరు బ్రాహ్మణ వీధిలో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి దినోత్సవ వేడుకలు ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తెల్లవారుజామునే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, అందమైన అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్యవైశ్య కుటుంబాలు భారీగా తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ నిర్వహించారు.సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తూ వేడుకలు మరింత వైభవంగా కొనసాగాయి.



---

# అవాకులు చవాకులు పేలితే ఊరుకోం: వైసీపీ నేతలపై మంత్రి నారాయణ ఫైర్

**చెట్లకోసం కార్పొరేషన్ నుంచి ఒక్క పైసా ఖర్చు చేయలేదు**

**వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయటం తగదు**

**ప్రతిపక్షాలకు మంత్రి నారాయణ స్ట్రాంగ్ కౌంటర్**




**నెల్లూరు ఏప్రిల్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :**అభివృద్ధికి అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తున్న వైఎస్సార్సీపీ అసత్య ఆరోపణలతో కాలం వెళ్లదీస్తోందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మండిపడ్డారు .ప్రతిపక్షం ఎన్ని కుట్రలు పన్నినా అభివృద్ధిని అడ్డుకోలేదని స్పష్టం చేసారు .ఆదివారం నగరంలోని మూడవ డివిజన్ లో పర్యటించిన మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు.అభివృద్ధి పై వైఎస్సార్సీపీ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు.ఎండ తీవ్రతను 2 డిగ్రీలు తగ్గించేందుకు ప్రతి 5 మీటర్లకు ఒక చెట్టు నాటాలని సంకల్పించాననన్నారు.ఇందుకోసం కార్పొరేషన్ నుంచి ఒక్క పైసా ఖర్చు చేయకుండా దాతల ద్వారా నిధులు సేకరించామని స్పష్టం చేశారు. కేవలం చెట్ల కోసమే ఒక దాత 2 కోట్లు ఇచ్చారని,చెట్లు ,ట్రీ గార్డులు కూడా తన స్నేహితులే అందజేస్తున్నారని తెలిపారు. దేశ విదేశాల్లో ఉన్న తన మిత్రుల సహాయం అడుగుతున్నది తన ఇంటి కోసం కాదని ,తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సిటీ అభివృద్ధి కోసమేనని పేర్కొన్నారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తూ వీఆర్ హై స్కూల్ను రోల్ మోడల్గా తీర్చిదితే దానిపైనా విమర్శలు చేయటం సబబు కాదన్నారు .విఆర్సీ లో విద్యార్థులకు మధ్యాహ్నభోజన పథకం ప్రభుత్వం అమలు చేస్తుంటే ,ఉదయం టిఫిన్, సాయంత్రం స్నాక్స్ నారాయణ గ్రూప్స్ ద్వారా ఉచితంగా ఇస్తున్నామని వెల్లడించారు.వీఆర్సీకి నారాయణ విద్యాసంస్థలనుంచే తొలుత పదిబస్సులు కేటాయించటం జరిగిందని,వాటి నిర్వహణ ఖర్చుకూడా తన పిల్లలే భరిస్తున్నారన్నారు .సీఎస్సార్ ఫండ్స్ ద్వారా యూనియన్ బ్యాంకు ఇచ్చిన నాలుగు బస్సుల నిర్వహణకు నెలకు 67 వేల రూపాయలు ,మిగిలిన ఆరు బస్సులకు నెలకు లక్షా పదిహేను వేల నిర్వహణ ఖర్చు నారాయణా విద్యాసమస్తే బరిస్తోందని గుర్తుచేశారు .సీఎస్సార్ ఫండ్ తో పాటు ఆదాయంలో కొంత పేదలకు కేటాయించమని తానా పిల్లలకు చెప్పానన్నారు .పేదరికం వల్ల తాను నడిచి బడికి వెళ్ళేవాడినని తెలిపారు .పేద విద్యార్థుల కష్టాలు తెలిసిన వాడిగా 5 కోట్ల సొంత నిధులతో 7900 సైకిళ్లను పంపిణీకి సిద్ధం చేశామని తెలిపారు .ఇవన్నీ ఇప్పటివరకూ చెప్పుకోలేదన్నారు .నిరుపేద పిల్లలకోసం ప్రభుత్వ స్కూల్స్ ని బాగు చేస్తుంటే ఓర్వ లేక అడ్డు తగలటం అవాకులు చెవాకులు పేలటం ఆవేదన కలిగిస్తోందన్నారు .నేను తప్పు చేయను ,చేయాల్సిన అవసరం నాకు లేదని ,విమర్శకులకు సమాధాధానం చెప్పాల్సిన అవసరం అంతకన్నా లేదన్నారు .తనను అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజలకు వాస్తవాలు తెలియాలి కాబట్టే చెబుతున్నానన్నారు .ఎవరెన్ని కుట్రలు చేసినా అభివృద్దే అజెండాగా ముందుకు సాగుతానని స్పష్టం చేసారు. రాజకీయాల్లో అంతర్గత ఆధిపత్య పోరు సహజమే అన్నారు .దాన్ని బూతద్దంలో చూడవద్దని హితవు పలికారు.వ్యక్తిగతంగా వ్యక్తులను టార్గెట్ చేస్తూ మీడియా ,సోషల్ మీడియా కధనాలు ఇవ్వటం బాధాకరమన్నారు .నిజాలు ఉంటే నిర్భయంగా ఇవ్వండి తప్పులు ఉంటే సరిదిద్దుకుంటామని అన్నారు .ప్రజలు ప్రతిపక్షాల మాయలో పడి మోసపోవద్దన్నారు .కాస్త ఓపిక పడితే పనులన్నీ పూర్తి చేసి అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తామన్నారు .ఈ కార్యక్రమంలో నగర కమీషనర్ నందన్,మేయర్ సుజాత అశోక్,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ,టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజేతా రెడ్డి,nagara పార్టీ అధ్యక్షులు మామిడాల మధు,శ్రీకాళహస్తి పాలకమండలి సభ్యురాలు కొమ్మరి విజయమ్మ, డివిజన్ కో బీఎల్సీ జాన్సీ,టీడీపీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

# "నీ గుట్టు అంతా నాకు తెలుసు": బుడ్డోడికి ఇషాన్ కిషన్ వార్నింగ్



ఐపీఎల్ 2026 సీజన్లో భాగంగా శనివారం జైపూర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ క్రికెట్ అభిమానులకు అసలైన వినోదాన్ని పంచింది. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. సన్‌రైజర్స్ బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 36 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగవంతమైన శతకాలలో ఒకటిగా తన పేరును లిఖించుకున్నాడు. మొత్తం 37 బంతుల్లో 103 పరుగులు చేసిన వైభవ్ ఇన్నింగ్స్ సాయంతో రాజస్థాన్ రాయల్స్ 228 పరుగుల భారీ స్కోరు సాధించింది.

అయితే ఇంతటి భారీ లక్ష్యాన్ని సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎంతో ఆత్మవిశ్వాసంతో ఛేదించింది. ఇషాన్ కిషన్ కేవలం 31 బంతుల్లో 74 పరుగులతో విధ్వంసం సృష్టించగా.. అభిషేక్ శర్మ (57) కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరి ధాటికి సన్‌రైజర్స్ 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మ్యాచ్ ముగిసిన తర్వాత ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ మధ్య ఓ ఆసక్తికరమైన సంభాషణ జరిగింది. చిన్నవాడైన వైభవ్ అద్భుత బ్యాటింగ్‌ను ఇషాన్ అభినందిస్తూనే.. సరదాగా అతడిని హెచ్చరించాడు. ఇషాన్ కిషన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "వైభవ్ ఆడుతున్న తీరు చూస్తుంటే భయం వేసింది. అతను మరో రెండు ఓవర్లు క్రీజులో ఉండి ఉంటే స్కోరు 258కి చేరుకునేది. సాకిబ్ హుస్సేన్ అతడిని ఔట్ చేయడంతో మేము ఊపిరి పీల్చుకున్నాం. అతను బ్యాటింగ్ చేస్తున్న పిచ్చి వేగం గురించి మాట్లాడుతూ.. వచ్చేసారి మా జట్టుతో ఆడేటప్పుడు కొంచెం నెమ్మదిగా ఆడమని చెప్పాను. నీ రహస్యాలన్నీ, నీ ఇన్‌సైడ్ స్టోరీలన్నీ నాకు తెలుసు అని అతడిని సరదాగా ఆటపట్టించాను" అని జియో హాట్‌స్టార్‌తో జరిగిన చర్చలో వెల్లడించాడు.

ఇదే క్రమంలో ఇషాన్ కిషన్ తన టీమిండియా రీ-ఎంట్రీ గురించి కూడా మాట్లాడాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్ తరఫున 500కు పైగా పరుగులు చేసి, మళ్లీ జాతీయ జట్టులోకి రావడం గురించి వి రిస్తూ.. జట్టులో చోటు కోల్పోయినప్పుడు ఏడవడం లేదా బాధపడటం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నాడు.

# వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ నుంచి ఔట్, అసలు కారణం..

సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ పై బిగ్ అప్డేట్. ఐపీఎల్ 2026లో వైభవ్ సూర్యవంశీ జోరు మామూలుగా లేదు. సన్ రైజర్స్ తో జరిగిన మ్యాచ్ లో కేవలం 36 బంతుల్లోనే సెంచరీ బాదాడు. 15 ఏళ్ల వయసులో రికార్డుల మోత మోగిస్తూ.. క్రికెట్ ఫ్యాన్స్ ప్రశంసలు అందుకుంటున్న వైభవ్ సూర్యవంశీ తీవ్రంగా గాయపడ్డాడు. టీం సిబ్బంది సహకారంతో మైదానం నుంచి బయటకు వెళ్లాల్సి వచ్చింది. ఇప్పుడు వైభవ్ సూర్యవంశీ గాయం పైన బిగ్ అప్డేట్ వచ్చింది. సన్ రైజర్స్ తో జరిగిన మ్యాచ్ లో వైభవ్ సూర్యవంశీ మరో సెంచరీ నమోదు చేసాడు. ఐపీఎల్ హిస్టరీలో ఇది మూడో ఫాస్టెస్ట్ సెంచరీ. కానీ ఆ తర్వాత ఫీల్డింగ్ చేస్తూ వైభవ్ సూర్యవంశీ గాయ పడ్డాడు. తొడ కండరాలు పట్టేయడంతో నొప్పితో బాధపడ్డాడు.

సహాయక సిబ్బంది సహకారంతో మైదానం నుంచి బయటకు వెళ్లాడు. వైభవ్ ప్రస్తుతం ఆరెంజ్ క్యాప్ రేసులో ఉన్నాడు. జోఫ్రా ఆర్చర్ వేసిన ఓవర్ పిచ్ బంతిని ఇషాన్ కిషన్ కవర్స్ దిశగా భారీ షాట్ ఆడాడు. ఆ బంతిని అడ్డుకోవడానికి సర్కిల్ లోపల ఉన్న వైభవ్ సూర్యవంశీ వెనక్కి పరిగెత్తాడు. అయితే బంతిని వెంబడిస్తున్న క్రమంలో ఒక్కసారిగా అతనికి



హామ్‌స్ట్రింగ్ పట్టేసింది. వెంటనే నడవలేక మైదానంలోనే కూలబడిపోయాడు. వైభవ్ ఇబ్బంది పడటం చూసి వెంటనే ఫిజియోలు మైదానంలోకి వచ్చి ప్రాథమిక చికిత్స అందించారు.

కానీ నొప్పి తీవ్రంగా ఉండటంతో అతను లేచి నడవలే కపోయాడు.

కనీసం అడుగు తీసి అడుగు వేయడానికి కూడా ఇబ్బంది పడటంతో, సపోర్ట్ స్టాఫ్ అతనిని భుజాల మీద మోసుకుంటూ మైదానం వెలుపలికి తీసుకెళ్లారు. సెంచరీ హీరో ఇలా వెళ్లడం ఎవరికీ నచ్చలేదు. కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసిన వైభవ్.. 278 స్ట్రైక్ రేట్‌తో విధ్వంసం సృష్టించాడు.

రాజస్థాన్ రాయల్స్ ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉండాలంటే వైభవ్ సేవలు చాలా అవసరం. ఈ హామ్‌స్ట్రింగ్ గాయం తీవ్రమైనది అయితే.. వైభవ్ కనీసం 2-3 వారాల పాటు ఆటకు దూరం కావాల్సి ఉంటుందని చెబుతున్నారు.

# కొంపముంచిన జడేజా.. బుడ్డోడి శతకం వృథా



ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరు కొనసాగుతోంది. వరుసగా నాలుగో మ్యాచ్‌లో గెలుపొందింది. శనివారం జైపూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ఆరెంజ్ ఆర్మీ 5 వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసింది. ఈ గెలుపుతో రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ సెంచరీ వృథా అయ్యింది.

ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ రాజస్థాన్ రాయల్స్ ఓటమి పాలైంది. రవీంద్ర జడేజా ఘోర తప్పిదంతో పాటు లోయార్డర్ బ్యాటింగ్ వైఫల్యం రాజ స్థాన్ రాయల్స్ విజయవకాశాలను దెబ్బతీ సింది. చెలరేగిన ఇషాన్.. 229 పరుగుల భారీ లక్ష్యాన్ని సన్‌రైజర్స్ హైదరాబాద్ 18.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇషాన్ కిషన్ (31 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లతో 74), అభిషేక్ శర్మ(29 బంతుల్లో 11 ఫోర్లు, సిక్స్‌తో 57) విధ్వంసకర హాఫ్ సెంచరీలతో చెలరేగగా.. నితీష్ కుమార్ రెడ్డి(18 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 36), హెన్రీచ్ క్లాసెన్(24 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 29) రాణించారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, బ్రిజేష్ శర్మ రెండేసి వికెట్లు తీయగా.. డొనోవన్ ఫెర్రీరా ఒక వికెట్ తీసాడు. అంతకుముందు రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 228 పరుగుల భారీ స్కోర్ చేసింది. వైభవ్ సూర్యవంశీ(37 బంతుల్లో 5 ఫోర్లు, 13 సిక్స్‌లతో 103)సెంచరీతో చెలరేగగా.. ధ్రువ్ జురెల్(35 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీతో రాణించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో ఇషాన్ మలింగా(2/38) రెండు వికెట్లు తీయగా.. ప్యాట్ కమిన్స్, సాకిబ్ హుస్సేన్, నితీష్ కుమార్ రెడ్డి, ప్రఫుల్ హింగేలు తలో వికెట్ తీసారు. కొంపముంచిన జడేజా.. 229 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు శుభారంభం దక్కలేదు. తొలి ఓవర్‌లోనే ట్రావిస్ హెడ్ ఔటవ్వగా.. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ జట్టును ఆదుకున్నారు. అయితే 30 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద తుషార్ పాండే బౌలింగ్‌లో అభిషేక్ శర్మ ఇచ్చిన సునాయస జడేజా వదిలేసాడు.

# అర్ధ శతకంతో మెరిసిన తమిళ తంబీ.. గుజరాత్‌కు నాలుగో విజయం..



పంతొమ్మిదో సీజన్లో గుజరాత్ టైటాన్స్ హ్యాట్రిక్ ఓటమి తప్పించుకుంది. చెపాక్ స్టేడి యంలో రబడ (3-25) విజృంభణతో చెన్నై సూపర్ కింగ్స్ భారీ స్కోర్ కొట్టనివ్వని గుజ రాత్.. మోస్తరు లక్ష్యాన్ని అలవోకగా ఛేదిం చింది. ఓపెనర్లు సాయి సుదర్శన్(87), శుభ్‌మ న్ గిల్(33) శుభారంభంతో విజయానికి బాటలు వేయగా.. జోస్ బట్లర్(39 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. దాంతో 8 వికెట్ల తేడాతో గెలిచిన గుజరాత్ ఈ ఎడిషన్‌లో నాలుగో విజయం నమోదు చేసింది.

మాజీ ఛాంపియన్ గుజరాత్ టైటాన్స్ మళ్లీ గెలుపు బాట పట్టింది. ముంబై, ఆర్సీబీ చేతుల్లో చిత్తైన గుజరాత్ చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌ను దారుణంగా ఓడించింది. తొలు త సీఎస్కేను 158కే కట్టడి చేసిన గుజ రాత్.. మోస్తరు ఛేదనను గుజరాత్ ఓపెనర్లు సాయి సుదర్శన్(87), శు భ్‌మన్ గిల్(33)లు దూకుడుగా ఆరంభించారు. వీరిద్దరి జోరుతో గుజరాత్ పవర్ ప్లేలో 55 రన్స్ కొట్టింది. కానీ నూర్ అహ్మద్ ఓవర్లో గిల్‌ను శాంసన్ స్టంపౌట్ చేయగా తొలి వికెట్ పడింది. అనంతరం జోస్ బట్లర్(39 నాటౌట్), సుదర్శన్ జోరు కొనసాగించారు. లోకల్ బాయ్ సుదర్శన్ తన స్టయిల్ ఆటతో అర్ధ శతకం బాదేసి గుజరాత్ గెలుపు ఖాయం చేశాడు. బట్లర్ అండగా తమిళ తంబీ చెలరేగడంతో చెన్నై బౌలర్లు వికెట్ తీయలేక అపసోపాలు పడ్డారు. నూర్ ఓవర్లో స్ట్రెయిట్ సిక్సర్ బాదిన సుదర్శన్ .. గుర్జప్‌నీత్ వేసిన 16వ ఓవర్లో రెండు సిక్సర్లు బాదాడు. విజయానికి ఐదు పరుగుల దూరంలో అకీల్ హొసేన్ ఓవర్లో సుదర్శన్ ఔటైనా.. సిక్సర్‌తో లాంఛనం ముగించిన బట్లర్ 8 వికెట్ల విజ యాన్ని కట్టబెట్టాడు. చెన్నైని ఆదుకున్న గైక్వాడ్‌పంతొమ్మిదో సీజన్‌లో విఫలమవుతున్న రుతురాజ్ గైక్వాడ్(74 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఆదుకున్నాడు. చిదంబరం స్టేడియంలో గుజరాత్ టైటాన్స్ పేసర్ రబడ(3-25) ధాటికి పవర్ ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయిన చెన్నైని గైక్వాడ్ గట్టెక్కించాడు. రబడ, సిరాజ్ ధాటికి 37 కే నాలుగు వికెట్లు పడినా.. శివం దూబే(22), కార్తిక్ శర్మ(15), జేమీ ఓవర్టన్(18)లతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ఆఖరి ఓవర్లో సిక్స్, రెండు ఫోర్లతో సీఎస్కేకు పోరాడగలిగే స్కోరందించాడు గైక్వాడ్.

# సఫారీలను హడలెత్తించిన దీప్తి.. నాలుగో టీ20లో భారత్‌దే విజయం..!

దక్షిణాఫ్రికా గడ్డపై పొట్టి సిరీస్‌లో భారత మహిళల జట్టు ఎట్టకేలకు బోణీ కొట్టింది. హ్యాట్రిక్ ఓటములతో ట్రోఫీ సమర్పించుకున్న టీమిండియా.. నాలుగో టీ20లో ఆతిథ్య జట్టుకు షాకిచ్చింది. దీప్తి శర్మ(36 నాటౌట్, 5-19) ఆల్‌రౌండ్ షోకు జెమీమా రోడ్రిగ్స్(43) కీలక ఇన్నింగ్స్ తోడవ్వగా సఫారీలపై 14 పరుగుల తేడాతో గెలుపొంది పరువు కాపాడుకుంది. ఈ విజయంతో ఐదు టీ20ల సిరీస్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన వైట్‌వాష్ తప్పించుకుంది.

పొట్టి ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌లో భారత మహిళల జట్టు తొలి విజయంతో మురిసింది. దక్షిణాఫ్రికా గడ్డపై పొట్టి సిరీస్ కోల్పోయిన టీమిండియా ది వాండర్స్ స్టేడియంలో పంజా విసిరింది. తొలుత జెమీమా రోడ్రిగ్స్(43), దీప్తి శర్మ(36 నాటౌట్), రీచా ఘోష్(34 నాటౌట్)ల మెరుపులతో భారీ స్కోర్ కొట్టిన టీమిండియా.. అనంతరం దక్షిణాఫ్రికాను 171కే కట్టడి చేసింది. బ్యాటుతో రాణించిన దీప్తి బంతితోనూ చెలరేగుతూ ఐదు వికెట్ల ప్రదర్శన చేసింది.



ఫామ్‌లో ఉన్న లారా వొల్వార్ట్(18)ను ఔట్ చేసి క్రాంతి గౌడ్ బ్రేకివ్వగా.. దీప్తి శర్మ తిప్పేయడంతో సఫారీ మిడిలార్డర్ పెవిలియన్ బాట పట్టింది. తంజిబ్ బ్రిట్స్(30) దూకుడుకు చరణి చెక్ పెట్టింది. డేంజరస్ సునే లుస్(40), అనెరీ డెర్క్‌సెన్(9), రెనెకే(21) అయబొగ ఖాకా(1), సెఖుఖునే(4)లను ఔట్ చేసిన దీప్తి తొలిసారి టీ20ల్లో ఐదు వికెట్లు పడగొట్టింది. దాంతో, 14 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్ పరాజయాలకు ముగింపు పలికింది. ఇరుజట్ల మధ్య ఐదో మ్యాచ్ సోమవారం బెనోనిలోని విల్లోమూరే పార్క్‌లో జరుగనుంది.

# చెన్నైని ఆదుకున్న గైక్వాడ్.. నాలుగో విజయం ఎవరిదో..!

పంతొమ్మిదో సీజన్‌లో విఫలమవుతున్న రుతురాజ్ గైక్వాడ్(74 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఆదుకున్నాడు. చిదంబరం స్టేడియంలో గుజరాత్ టైటాన్స్ పేసర్ రబడ(3-25) ధాటికి పవర్ ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయిన చెన్నైని గైక్వాడ్ గట్టెక్కించాడు. 37 కే నాలుగు వికెట్లు పడినా.. శివం దూబే(22), కార్తిక్ శర్మ(15), జేమీ ఓవర్టన్(18)లతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ఆఖరి ఓవర్లో సిక్స్, రెండు ఫోర్లతో సీఎస్కేకు పోరాడగలిగే స్కోరం దించా డు. సొంత మైదానంలో దంచేస్తాం నుకుంటే చెన్నై సూపర్ కింగ్ హిట్టర్లలు వరసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. టాస్ ఓడిన జట్టు కు శుభారంభం ఇస్తారనుకుంటే పేసర్ రబడ (3-25) ధాటికి గత మ్యాచ్ శతక వీరుడు సం జూ శాంసన్(11) ఔటవ్వగా.. కొత్త కుర్రాడు ఉర్విల్ పటేల్(4)ను సైతం రబడ వెనక్కి పంపాడు. ఫామ్‌లో ఉన్న సర్ఫరాజ్ ఖాన్(0)ను సిరాజ్ .. డేంజరస్ డెవాల్డ్ బ్రెవిస్(2)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చారు. అంతే.. మైదానంలో నిశబ్దం ఆవహించింది. చూస్తుం డగానే నాలుగు



వికెట్లు పడిన వేళ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(74 నాటౌట్), శివం దూబే(22)లు ఆచితూచి ఆడారు. హాఫ్ సెంచరీ భాగస్వామ్యంగుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో గైక్వాడ్, దూబేలు పెద్ద షాట్లకు యత్నించలేదు. ఒక్క బౌండరీ రాకపోవడంతో నెట్‌రన్‌రేటు నాలుగు లోపే ఉంది. అయితే.. హోల్డర్ వేసిన 12వ ఓవర్ చివరి బంతికి దూబే బౌండరీతో స్కోర్ యాభై దాటింది. ఆ తర్వాత అర్షద్ ఓవర్లో గేర్ మార్చిన గైక్వాడ్ రెండు సిక్సర్లతో ఊపు తెచ్చా డు. రషీద్ ఓవర్లో దూబే 4, 6 గైక్వాడ్ బౌం డరీతో 21 రన్స్ పిండుఉకన్నారు.

అయితే.. అర్షద్ సూపర్ డెలివరీకి దూబే ఆఫ్ స్టంప్ ఎగిరిపోవడంతో తెరపడింది.

# వైభవ్ ఆట నచ్చింది.. ఇప్పుడు అతడే నా ఫేవరెట్ ప్లేయర్..

ఐపీఎల్లో రెండో శతకంతో రికార్డు నెలకొల్పిన వైభవ్ సూర్యవరి అభిమానులు పెరిగిపోతున్నారు. తొలి బంతి నుంచే విరుచుకుపడే ఈ హిట్టర్ ఆటకు ఫిదా అవుతున్న దిగ్గజాలు 'వారెవ్వా .. ఏమన్న ఆడుతున్నాడా' అని ప్రశంసలు కురిపిస్తున్నారు. తన దూకుడైన ఆటతో ప్రత్యర్థి జట్టు ఆటగాళ్ల మనసులు గెలుచ కుంటున్న వైభవ్‌కు సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ సైతం అభిమానిగా మారాడు. శనివారం జైపూర్ 36 బంతుల్లోనే శతకం బాదిన ఈ చిచ్చరపిడుగు ఆటపై కమిన్స్ ప్రశంసలు కురిపించాడు. పంతొమ్మిదో సీజన్‌లో విధ్వంసక ఆటతో ప్రపంచ స్థాయి బౌలర్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్న వైభవ్ సూర్యవంశీ రికార్డుల మోత మోగిస్తున్నాడు. దూకుడే మంత్రగా ఆడుతూ రాజస్థాన్ రాయల్స్‌కు మెంపు ఆరంభాలిస్తున్న ఈ కుర్రాడి ఆటకు తాను వీరాభిమానినిఇ అయ్యానంటున్నాడు కమిన్స్. జైపూర్‌లో వైభవ్ కళ్లారా చూసిన ప్యాటీ మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ నా కొత్త ఫేవరెట్ ప్లేయర్ వైభవ్ అని పేర్కొన్నాడు. 'వైభవ్ నా కొత్త ఫేవరెట్ క్రికెటర్. అతడు బంతిని బలంగా కొడుతున్నాడు. అతడి ఆట చూడడం చాలా అద్భుతంగా అనిపించింది. బౌలర్లు సరైన లైన్ అండ్ లెంగ్త్‌లో బౌలింగ్ చేయాలి. బౌలింగ్ లయ తప్పితే బంతి ఎక్కడికో వెళ్తుంది. వైభవ్ ఆట నన్ను ఆకట్టుకుంది. అతడు కెరీర్‌ను చాలా



గొప్పగా మొదలెట్టాడు. వైభవ్ ఆడే విధానం నాకు చాలా నచ్చింది. అతడు మ్యాచ్‌ను చేతుల్లోంచి లాగేసుకుంటాడు' అని కమిన్స్ వైభవ్‌పై ప్రశంసలు కురిపించాడు.

వైభవ్ సెంచరీ వృథాపంతొమ్మిదో సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరు చూపిస్తోంది. ఉప్పల్‌లో హ్యాట్రిక్ విజయాలకు కొనసాగింపుగా జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసింది. వైభవ్ పిడుగల్లే విరుచుకుపడ్డారు.

# ఆటుపోట్ల మార్కెట్లో పెట్టుబడి వ్యూహాలు ఎలా

కొత్త ఆర్థిక సంవత్సరం (2026-27)లోనూ దేశీయ స్టాక్ మార్కెట్ ఊగిసలాడుతోంది. ఈ ఊగిసలాటతో గత రెండేళ్లుగా రేసుగుర్రాల్లా పరుగెత్తిన సూచీలు ఇప్పుడు తీవ్ర ఆటుపోట్లు ఎదు ర్కొంటున్నాయి. ఈ ప్రభావం ఈక్విటీ మార్కెట్లతో పాటు ఇతర పెట్టుబడుల మార్కెట్లపైనా కనిపిస్తోంది. అమెరికా-ఇరాన్ యుద్ధంతో ఇది మరింత తీవ్రమైంది. అయితే కొన్ని పెట్టుబడుల వ్యూహాల ద్వారా మదుప రులు ఈ ఆటుపోట్ల నుంచి బయటపడవచ్చు. అవేమిటంటే.. లక్ష్యాలు సరిదిద్దుకోవడంచాలా మంది మదుపరులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానికే కట్టుబడి ఉంటారు. పెట్టుబడుల మార్కెట్లో ఇది సరైన వ్యూహం కాదు. మారుతున్న మార్కెట్ పరిస్థితులు, ఆదాయాలు, వ్యక్తిగత బాధ్యత లకు అనుగుణంగా ఈ లక్ష్యాలనూ ఎప్పటికప్పుడు సమీక్షించుకుని సరిదిద్దుకోవాలి. ఇందుకు ఈ ఆర్థిక సంవత్సరం సరైన సమయం. ఉదాహరణకు మీ ఆర్థిక లక్ష్యం రెండేళ్ల దూరంలో ఉందనుకుందాం. ప్రస్తుత ఆటుపోట్ల నేపథ్యంలో ఈక్విటీలో భారీ పెట్టుబడులు ఏ మాత్రం సరైంది కాదు. అదే రిటైర్మెంట్ వంటి దీర్ఘకాలిక లక్ష్యాలైతే, ప్రస్తుత ఆటుపోట్లలో మంచి కంపెనీల షేర్లు కొనుగోలు చేయడం మంచిది. ఇది సంపద సృష్టికి దోహదం చేస్తుంది. అంటే సమయం,



సంద ర్భాన్ని బట్టి ఎప్పటికప్పుడు పెట్టుబడుల లక్ష్యానికి అనుగుణంగా పెట్టుబడుల వ్యూహం మార్చుకోవాలి. పెట్టుబడుల కేటాయింపుఆర్థిక లక్ష్యాల సాధనలో పెట్టుబడుల కేటాయింపుదీ కీలక పాత్ర. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ ఒక్క ఆస్తులపైనా ముఖ్యంగా ఈక్విటీ మార్కెట్లో అధిక పెట్టుబడులు ఏ మాత్రం మంచిది కాదు. అమెరికా-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఈ సంవత్సరం మార్కెట్లు ఎప్పుడు ఏ మలుపు తీ సు కుం టా యో నా తెలియని స్థితి. దీన్ని దృష్టిలో ఉంచుకుని మదుపరులు తమ పెట్టుబడులను ఒకే ఆస్తుల్లో మదుపు చేయకుండా ఈక్విటీ, రుణ పత్రాలు, బులియన్ వంటి ఆస్తుల్లోనూ పెట్టడం మంచిది. దీనివల్ల ఒక పెట్టుబడి నిరాశ పరిచినా.. ఇంకో పెట్టుబడి ఆదుకుంటుంది. దీంతో పెట్టుబడుల 'అసలు'కూ పెద్దగా ధోకా ఉండదు. ఉదాహరణకు ఈక్విటీ మార్కెట్లు తీవ్ర ఆటుపోట్లకు లోనవుతున్నప్పుడు రుణ పత్రాల మార్కెట్ స్థిరమైన రాబడులు అందిస్తుంది. అదే అంతర్జాతీయ ఆటుపోట్లు ఎదురైతే బంగారం, వెండిలో పెట్టుబడులు 'అసలు'కు శ్రీరామ రక్ష. ఇలా చేయడం వల్ల దీర్ఘ కాలిక పెట్టుబడి లక్ష్యాలూ నెరవేరతాయి.

# అంజలికి కథ చెప్పేందుకు వెళ్లిన విశాల్.. 'మకుటం' కాన్సెప్ట్



తెలుగు, తమిళ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ విశాల్. ఈ టాలెంటెడ్ యాక్టర్ స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'మకుటం'. ప్రతిష్టాత్మక సూపర్‌గుడ్ ఫిల్మ్స్ పతాకంపై ఆర్.బి.చౌదరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సంస్థ నుంచి వస్తున్న 99వ సినిమా కావడం విశేషం. ఈ మూవీలో దుషార విజయన్, అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. తంబి రామయ్య, ఐర్జె తదితరులు ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.తాజాగా అంజలి, విశాల్ ఓ కాన్సెప్ట్ వీడియోతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. డైరెక్టర్ అయిన విశాల్ అంజలి దగ్గరకి కథ చెప్పేందుకు వెళ్తాడు. ఇక కథ చెప్పండి డైరెక్టర్ గారు అని అంజలి అంటారు. ఒక అందమైన గ్రామం అని విశాల్ మొదలు పెట్టగానే.. అది ప్రొడక్షన్ వాళ్లు చూసుకుంటారు కదా.. ముందు మీరు కథ చెప్పండి అంటూ కౌంటర్ వేస్తుంది అంజలి. విశాల్ కథ చెబుతూ ఉంటే మధ్యమధ్యలో సెటైర్స్ వేస్తూ.. మేనేజర్ మంచి కథ అని చెప్పారే.. అసలు మీ వద్ద కథ ఉందా..? అని అడగడంతో విశాల్ పారిపోతాడు. రేపు వచ్చి మరో కథ చెబుదామని వెళ్లిపోయే కాన్సెప్ట్ వీడియో ఆసక్తికరంగా సాగుతూ మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది.మకుటం చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. విశాల్ దర్శకత్వ బాధ్యతలతోపాటు స్క్రీన్‌ప్లే కూడా చూసుకోనున్నాడు. విశాల్, అంజలి కాంబినేషన్‌కు సూపర్ క్రేజ్ ఉంటుందని తెలిసిందే. మరి ఈ ఇద్దరు ఎలాంటి స్టోరీతో రాబోతున్నారన్నది చూడాలి. ఇందులో నెవ్వర్ బిఫోర్ నెవ్వర్ ఆఫ్టర్ అనేలా క్లైమాక్స్ ఉండబోతుందని.. ఓవైపు దర్శకునిగా, మరోవైపు నటుడిగా విశాల్ విశ్వరూపం చూపించడం ఖాయమని మేకర్స్ చెబుతున్నారు.

## ఐదు బ్రేకప్స్, వన్ సైడ్ లవ్ స్టోరీ ... బిగ్ బాస్ ఫేం అర్జున్ కళ్యాణ్ ఎమోషనల్ కామెంట్స్



సినిమాలతో కెరీర్ ప్రారంభించి, సీరియల్స్ ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ కళ్యాణ్, రియాలిటీ షో 'బిగ్ బాస్ సీజన్ 6'లో పాల్గొని మరింత పాపులారిటీ సంపాదించాడు. ప్రస్తుతం పలు టీవీ కార్యక్రమాలు, వెబ్ సిరీస్‌ల తో బిజీగా ఉన్న ఆయన తాజాగా ఇచ్చిన ఇంట ర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబం ధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అర్జున్ కళ్యాణ్ మాట్లాడుతూ... ఇప్పటివరకు తన జీవితంలో ఐదు బ్రేకప్స్ జరిగాయని వెల్లడించారు. వాటిలో ఒకటి మాత్రమే పరస్పర అంగీకారంతో జరిగిన బ్రేకప్ కాగా, మిగిలినవి ఎక్కువగా వన్ సైడ్ లవ్ స్టోరీలేనని చెప్పారు. చదువుకునే రోజుల్లో కొంతమంది తనకు ప్రపోజ్ చేసినా, తాను మాత్రం సీరియస్‌గా ప్రేమించిన ఒక అమ్మాయికి తన ప్రేమను వ్యక్తం చేసినప్పటికీ, ఆమె నుంచి అంగీకారం రాలేదని తెలిపారు.ఆ ప్రేమ ఘటనకు చాలా కాలం అయిందని, ఇప్పుడు ఆ భావాలు తగ్గిపో యినా... అప్పట్లో జరిగిన సంఘటన తనకు హార్ట్ బ్రేక్ లా అనిపించిందని చెప్పారు. ఇప్పటికీ ఎక్కడో ఒకచోట ఆ వ్యక్తి గుర్తుకు వస్తుందని, అయితే గతంలో ఉన్న భావోద్వేగం ఇప్పుడు లేదని పేర్కొన్నారు. అంతేకాకుండా, ప్రేమపై తన అభిప్రాయాన్ని కూడా ఆయన పంచుకున్నారు. తాను ప్రేమించే అమ్మాయి తనకే వచ్చి ప్రపోజ్ చేయాలని ఒక కల ఉందని, కానీ అది జరగదని భావిసు_న్నాన న్నారు. ప్రస్తుతం నిజాయితీతో ఉన్న ప్రేమ ఎక్కువగా నిలవడం లేదని, మంచి మనసుతో ఉండే అబ్బాయిలను కొందరు అభిప్రాయపడ్డారు.

## సర్కార్ సీజన్ 6'లో సందడే సందడి... మల్లారెడ్డి స్పెషల్ ఎంట్రీతో హైప్




ప్రముఖ ఓటీటీ వేదిక ఆహా ప్రత్యేక కంటెంట్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ముందుకు సాగుతోంది. సూపర్ హిట్ సినిమాలు, ఆసక్తికర వెబ్ సిరీస్‌లతో పాటు వినోదాత్మక గేమ్ షోలతో అభిమానులను కట్టిపడేస్తోంది. ప్రస్తుతం ఆహాలో ప్రసారమవుతున్న 'సర్కార్ సీజన్ 6' మంచి విజయాన్ని అందుకుని దూసు కుపోతోంది.ఈ గేమ్ షోకు సుడిగాలి సుధీర్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. తన కామెడీ టైమింగ్, చమత్కారాలతో ప్రేక్షకులను అలరిస్తూ షోను మరింత రంజుగా మార్చు తున్నారు. ఇదివరకు తొలి మూడు సీజన్లకు ప్రదీప్ మాచిరాజు హోస్ట్‌గా ఉండగా, నాలుగో సీజన్ నుంచి సుధీర్ ఎంట్రీ ఇవ్వడంతో షో మరింత పాపులర్ అయింది.'ఈసారి అంతకు మించి' అనే ట్యాగ్‌తో సాగు తున్న సీజన్ 6లో ఇప్పటికే పలువురు ప్రముఖులు పాల్గొని ప్రేక్షకులను ఎంటర్టైన్ చేశారు. ఇప్పుడు పదో ఎపిసోడ్ కోసం విడుదలైన తాజా ప్రోమో మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ ఎపిసోడ్‌లో ప్రత్యేకంగా నలుగురు ప్రముఖులు గెస్ట్‌లుగా హాజరుకానున్నారు. కమెడియన్ అలీ, బిగ్ బాస్ ఫేమ్ విష్ణుప్రియ, నటుడు శివాజీ ఈ ఎపిసోడ్‌లో పాల్గొననున్నారు. వీరితో పాటు స్పెషల్ గెస్ట్‌గా ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరయ్యారు. ఎప్పుడూ తనదైన స్టైల్, నిలవనున్నారు.

## టబు మేనల్లుడు ఫతే రంధవా హీరోగా ఎంట్రీ... దారా సింగ్ బయోపిక్‌తో అరంగేట్రం



భారతీయ చలనచిత్ర రంగంలో తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన సీనియర్ నటి టబు ఇప్పుడు తన కుటుంబం నుంచి మరో నట వారసుడిని పరిచయం చేయడానికి సిద్ధమవుతున్నారని సమాచారం. ఆమె సోదరి, ఒకప్పటి ప్రముఖ నటి ఫరా నాజ్ కుమారుడు ఫతే రంధవా త్వరలోనే హీరోగా అరంగేట్రం చేయబోతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల సోషల్ మీడియాలో టబు, ఫతే కలిసి దిగిన సెల్ఫీలు వైరల్‌గా మారాయి. ఈ ఫోటోల్లో వారి మధ్య ఉన్న అనుబంధం స్పష్టంగా కనిపించడంతో పాటు, ఫతే లుక్స్ కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.ఫతే రంధవా మరెవరో కాదు... ప్రముఖ నటి ఫరా నాజ్, సీనియర్ నటుడు విందు దారా సింగ్ కుమారుడు. అంటే లెజెండరీ నటుడు, రెజ్లర్ దారా సింగ్ మనవడు కూడా. గత కొంతకాలంగా నటనలో శిక్షణ తీసుకుంటున్న ఫతే, తన తాత దారా సింగ్ జీవితకథ ఆధారంగా తెరకెక్కే బయోపిక్ ద్వారా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టనున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్ విషయంలో టబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తన మేనల్లుడు కెరీర్ కోసం సరైన కథలు, దర్శకులను ఎంపిక చేసే పనిలో ఉన్నారట.
ఇప్పటికే ఫతే ప్రముఖ నిర్మాణ సంస్థల వద్ద సహాయ దర్శకుడిగా పని చేసి సినీ రంగంలోని మెళకువలు నేర్చుకున్నట్లు టాక్ వినిపిస్తోంది.కథలు టబు, ఫరా నాజ్ సోదరీమణులు హైదరాబాద్‌కు చెందినవారే. టబు అసలు పేరు తబస్సుమ్ ఫాతిమా హాష్మీ. హైదరాబాద్‌లో చదువుకున్న ఆమె తర్వాత ముంబైకి వెళ్లి సినీ ప్రయాణాన్ని కొనసాగించారు.
మరోవైపు 1980లలో బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా వెలిగిన ఫరా నాజ్,
తర్వాత కుటుంబ జీవితానికి ప్రాధాన్యం ఇచ్చారు. ప్రస్తుతం ఫరా నాజ్ తన కుమారుడు ఫతేతో కలిసి ముంబైలో నివసిస్తున్నారు. తన కుమారుడు మంచి నటుడిగా ఎదగాలని ఆమె ఆశిస్తుండగా, ఫతే కూడా తన కుటుంబ వారసత్వాన్ని కొనసాగిస్తూ ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు సంపాదించాలని కృషి చేస్తున్నాడు. టబు అనుభవం, పరిచయాలు ఫతే కెరీర్‌కు పెద్దగా ఉపయోగపడతాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తానికి టబు మేనల్లుడు ఫతే రంధవా వెండితెర అరంగేట్రంపై ఆసక్తి పెరుగుతోంది


## 'ది కేరళ స్టోరీ 2' ఓటీటీ రిలీజ్ ముందుకు... కొత్త తేదీ ప్రకటించిన జీ5

బాలీవుడ్‌లో ఇటీవల చర్చనీయాంశంగా మారిన చిత్రాల్లో 'ది కేరళ స్టోరీ 2' ఒకటి. గతంలో వచ్చిన 'ది కేరళ స్టోరీ' చిత్రం భారీ సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. సున్నితమైన అంశాన్ని ప్రాధాన్యంగా తీసుకుని తెరకెక్కిన ఆ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. ఇప్పుడు అదే కథకు కొనసాగింపుగా దర్శకుడు కామాఖ్యా నారాయణ్ సింగ్ 'ది కేరళ స్టోరీ 2'ను మరింత లోతుగా, కొత్త కోణంలో తెరకెక్కించారు. అయితే ఈ సీక్వెల్‌కు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయి స్పందన మాత్రం రాలేదు. ఇదిలా ఉండగా, ఈ సినిమా ఓటీటీ విడుదలపై తాజా అప్డేట్ వచ్చింది. ప్రముఖ వేదిక జీ5 మొదట ఈ చిత్రాన్ని మే 8న స్ట్రీమింగ్ చేయనున్నట్లు ప్రకటించింది. కానీ తాజాగా విడుదల తేదీని మార్చి, ఒక వారం ముందుకు జరిపింది. దీంతో ఇప్పుడు ఈ చిత్రం మే 1 నుంచే ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది.
ఈ నిర్ణయం సినిమాను ఓటీటీలో చూడాలని ఎదురు చూస్తున్న ప్రేక్షకులకు గుడ్ న్యూస్‌గా మారింది. థియేటర్లలో మిస్సయినవారికి ఇది మంచి అవకాశం అని చెప్పవచ్చు.ఈ చిత్రంలో అదితి భార్య, ఉల్కా గుప్తా, ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రల్లో నటించారు. సన్ షైన్ పిక్చర్స్ బ్యానర్‌పై విపుల్ షా ఈ సినిమాను నిర్మించారు. థియేటర్లలో ఆశించిన ఫలితం అందుకోలేకపోయిన 'ది కేరళ స్టోరీ 2' ఓటీటీ




వేదికపై ఎలాంటి స్పందన దక్కించుకుంటుందో చూడాలి.ఈ చిత్రంలో గ్లామర్‌కు కంటే నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు కావడంతో నటీనటులు తమ పాత్రలను ఎంతో నిబద్ధతతో పోషించారు. ప్రతి పాత్రలోని భావోద్వేగాలు, సంఘర్షణలను ప్రేక్షకులకు బలంగా చేరేలా వారు నటనను ప్రదర్శించారు. ప్రముఖ నిర్మాత విపుల్ షా తన సన్‌షైన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. కథకు తగినట్టుగా నిర్మాణ విలువలు మెరుగ్గా కనిపిస్తాయి. వివాదాలను పక్కన పెడితే, సమాజంలో జరుగుతున్న కొన్ని అంశాలను వెలుగులోకి తీసుకురావాలనే ప్రయత్నం చిత్ర బృందం నుంచి స్పష్టంగా కనిపిస్తుంది.

## తమిళ బిగ్ బాస్ విన్నర్ టాలీవుడ్ ఎంట్రీ.. 'గాడ్స్ అండ్ సోల్జర్స్' టీం క్రేజీ న్యూస్..



దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ డైరెక్షన్‌లో వస్తోన్న చిత్రం 'గాడ్స్ అండ్ సోల్జర్స్' తమిళ, తెలుగు భాషల్లో వస్తోన్న చిత్రం . ఇప్పటికే విడుదల చేసిన మాస్ అండ్ ఎమోషన్స్, యాక్షన్ అంశాలతో ట్రైజర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీతో బిగ్ బాస్ (తమిళం )విన్నర్ ఆరి అర్జునన్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటం విశేషం.ఇందులో ఆరి అర్జునన్ పోలీస్ పాత్రలో కనిపించనున్నాడు. ఇందులో నిజాయితీ, ముక్కుసూటితో వ్యవహరించే పోలీసాఫీసర్‌గా ఆరిఅర్జునన్ కనిపించబో తున్నాడట. ఈ సినిమాతో రాజ్‌తరున్ కోలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. భరత్, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అమ్ము అభిరామి హీరోయిన్‌గా నటిస్తోంది.దర్శకుడు విజయ్ మెల్టన్ మాట్లాడుతూ.. మా ట్రైజర్‌ను విడుదల చేసి మాకు ప్రోత్సాహం అందించిన దర్శకుడు హరీష్ శంకర్‌కు ధన్యవాదాలు. భారీ స్థాయిలో, భావోద్వేగాల నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం, వాస్తవిక కథనంతో పాటు వాణిజ్య అంశాలను మేళవించిన సినిమాటిక్ అనుభూతిని ప్రేక్షకు లకు అందించనుంది. ఈ చిత్రంలో మంచి టాలెంటెడ్ నటీనటులు సరికొత్త అవతారంలో కనిపంచబోతున్నారన్నారని ఇప్పటికే డైరెక్టర్ విజయ్ మిల్టన్ క్లారిటీ ఇచ్చేశారు.
స్వతంత్ర సంగీత కళాకారుడు వేధన్ కూడా కీ రోల్‌లో నటిస్తున్నాడని కూడా చెప్పాడు. రఫ్ నోట్ ప్రొడక్షన్ జరుపుకుంటోంది.

## ధనుష్ 'కర'లో హీరోయిన్ ఎంపికపై ట్విస్ట్... ఫస్ట్ ఛాయిస్ మమితా కాదట, మరి ఎవరు?



కోలీవుడ్ స్టార్ ధనుష్, మలయాళ బ్యూటీ మమితా బైజు ప్రధాన పాత్రల్లో నటించిన తాజా యాక్షన్ ఎంటర్టైనర్ 'కర' విడుదలకు సిద్ధమవుతోంది. విఘ్నేష్ రాజా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో ధనుష్, మమితా భార్యాభర్తలుగా కనిపించనున్నారు. ఈ నెల 30న తమిళంతో పాటు తెలుగులోనూ ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.అయితే ఈ సినిమాలో హీరోయిన్‌గా మొదట ఎంపిక మమితా కాదని దర్శకుడు విఘ్నేష్ రాజా తాజా ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఈ పాత్ర కోసం మొదట చైత్ర జె ఆచార్‌ను ఎంపిక చేసి లుక్ టెస్ట్ కూడా చేశారు. అయితే ఆమె ఇప్పటికే నటించిన 'మై లార్డ్' సినిమాలో కూడా ఇలాంటి గెటప్ ఉండటంతో, రెండు చిత్రాల్లో ఒకే తరహా పాత్రగా కనిపిస్తుందని భావించి మార్పు చేసినట్లు తెలిపారు.ఆ తర్వాత మమితా బైజును సంప్రదించామని, ఆమె ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా 'కర'లోని పాత్ర ఉండటంతో మొదట అంగీకరిస్తుందో లేదో అనుమానం కలిగిందని చెప్పారు.
కానీ కథ విన్న వెంటనే ఆమె ఒప్పుకోవడం ఆశ్చర్యం కలిగించిందని దర్శకుడు వెల్లడించారు. ఇదిలా ఉండగా, తమిళ సినిమాల్లో అవకాశాల కోసం మలయాళ నటీమణులను ఎంపిక చేస్తున్నారన్న విమర్శలపై మమితా బైజు స్పందించారు. ఒక నటిగా కొత్త పాత్రలు చేయడం తన బాధ్యత అని, దర్శకుడు తన పాత్రకు సరిపో తామనుకుంటే అవకాశం ఇస్తారని పేర్కొన్నారు. ఆ అవకాశాన్ని తన ప్రతిభతో తెలిపారు.

## 'మైసా' కోసం రష్మిక యాక్షన్ అవతారం... గిరిజన పాత్రతో కొత్త సవాల్

కన్నడ బ్యూటీగా సినీ ప్రయాణం ప్రారంభించిన రష్మిక మందన్న, 'ఛలో' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమై తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు పొందింది. అనంతరం 'గీతా గోవిందం', 'సరిలేరు నీకెవ్వరు' వంటి హిట్ చిత్రాలతో తన స్థాయిని మరింత పెంచుకుంది. 'పుష్ప' సినిమాలో శ్రీవల్లిగా నటించి దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకుంది. తర్వాత వరుసగా భారీ ప్రాజెక్టులతో ముందుకు సాగిన రష్మిక, తక్కువ కాలంలోనే బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలు అందుకుని అగ్ర కథానాయికగా నిలిచింది. వ్యక్తిగత జీవితంలో కూడా కొత్త అధ్యాయం ప్రారంభించిన ఆమె, విజయ్ దేవరకొండతో వివాహం అనంతరం కూడా సినిమాలతో బిజీగా కొనసాగుతోంది.
ప్రస్తుతం ఒకవైపు భర్త విజయ్ దేవరకొండతో కలిసి 'రణబాలి' చిత్రంలో నటిస్తూనే, మరోవైపు లేడీ ఓరియెంటెడ్ మూవీ 'మైసా'లో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమాలో రష్మిక పూర్తిగా భిన్నమైన గిరిజన యువతిగా కనిపించ బోతోంది. ఈ పాత్ర కోసం ఆమె ప్రత్యేకంగా శిక్షణ తీసుకోవడం విశేషం. దర్శకుడు రవీంద్ర పుల్లే



తెరకెక్కిస్తున్న ఈ చిత్రం యాక్షన్ ప్రధానంగా రూపొందుతోంది. సినిమాలోని పోరాట సన్నివేశాలను అత్యంత సహజంగా, ఉత్కంఠ రేకెత్తించే విధంగా రూపొందించేందుకు చిత్రబృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇంద కోసం విదేశాల్లో శిక్షణ పొందిన రష్మిక, యుద్ధ విద్యల్లో కూడా నైపుణ్యం సాధించింది.
ప్రస్తుతం కేరళలోని అడవుల్లో ఈ చిత్రానికి సంబంధించిన కీలక యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ప్రముఖ యాక్షన్ నిపుణుల ఆధ్వర్యంలో సుమారు 15 రోజుల పాటు ఈ భారీ షెడ్యూల్ కొనసాగనుంది. ఈ సినిమాలో రష్మిక రఫ్, ఇంటెన్స్ లుక్‌లో కనిపిం చబోతుందని సమాచారం. మొత్తంగా చూస్తే, ఇప్పటివరకు గ్లామర్, రొమాంటిక్ పాత్రలతో ఆకట్టుకున్న రష్మిక, 'మైసా' ద్వారా పూర్తి స్థాయి యాక్షన్ పాత్రలో మెప్పించేందుకు సిద్ధమ వుతోంది. ఈ సినిమా షూటింగ్ అప్డేట్స్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచుతున్నాయి. ఇక భవిష్యత్తులో కూడా సమాచారం